
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బ్రోకర్లకే.. ఉచితం



వైసీపీ హయాంలో ఇసుకను బంగారంగా మార్చి బొక్కేశారు. ఇసుక పాలసీల పేరుతో నిర్మాణదారులకు చుక్కలు చూపారు. భవన నిర్మాణ కూలీలకు పనులు లేకుండా చేశారు. పాలకులేమో రూ.కోట్లు కొట్టేశారు. ఇసుక అక్రమాలకు చెక్ చెప్తూ.. అందరికీ అందుబాటులోకి తెస్తూ.. నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించేలా.. కూలీల ఉపాధికి ఢోకా లేకుండా.. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుకను ప్రవేశపెట్టింది. అయితే ప్రభుత్వ పాలసీ ప్రకారం ఎక్కడా కూడా ఇసుక సరఫరా జరగడం లేదని క్షేత్రస్థాయి పరిస్థితులు తెలియజేస్తున్నాయి. గతంలో ఏవిధంగా అయితే వసూలు చేశారో ఆ ప్రకారంగానే ప్రస్తుతం కూడా ఇసుకను అమ్ముకుంటున్నారు. ప్రభుత్వ ఉచిత ఇసుకతో బ్రోకర్లు సొమ్ము చేసుకుంటున్నారు. అధికారుల పర్యవేక్షణ, నియంత్రణ లేకపోవడంతో ఉచిత ఇసుక లబ్ధి నిర్మాణదారులకు అందడంలేదని తెలుస్తోంది. స్టాక్ యార్డుల్లో కూడా బ్రోకర్ల హవానే కొనసాగుతోంది. దీంతో ఉచిత ఇసుక కోసం వెళ్లిన సామాన్యులకు సక్రమంగా అందడంలేదని సమాచారం. అధికా రులు కూడా బ్రోకర్లకు సహకరిస్తున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలేదు. ఈ క్రమంలో నిర్మాణదారులు ఇసుక రూపంలో దోపిడీకి గురవడం పరిపాటిగా మారింది. అధికారులు కలగ చేసుకొని ఉచిత ఇసుక విధానం సక్రమంగా జరిగేటట్లు చూడాలని పలువురు కోరుతున్నారు.



పిట్టలవానిపాలెం మండలంలో ట్రాక్టర్లలో తరలిపోతున్న ఇసుక

ప్రభుత్వం మారినా ఆగని దందా

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం పోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వైసీపీ ఇసుక పాలసీని రద్దు చేస్తూ చంద్రబాబు ఉచిత ఇసుకను ప్రవేశపెట్టారు. అయినా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇసుక అక్రమాలకు అడ్డుకట్ట పడలేదు. ఐదేళ్లు ఇష్టారీతిన అక్రమాలకు పాల్పడిన ఇసుకాసురులు కొత్త ప్రభుత్వంలోనూ ఇసుక దందా కొనసాగి స్తున్నారు. దీంతో ప్రభుత్వ ఉచిత ఇసుక విధానం ప్రకటనలకే పరిమితమైందన్న విమర్శలు వస్తు న్నాయి. బినామీ పేర్లతో ఉచిత ఇసుకను బ్లాక్ చేసి గతంలోలానే విక్రయి స్తున్నారు. ఇదిలా ఉంటే చాలా చోట్ల ఇంకా నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో గత ప్రభుత్వంలో ఇసుక మాఫియాను నడిపించిన నేతలే నేటికీ అదే రీతిలో దందా నడిపించడం గమనార్హం.

- వినియోగదారులకు అందని ఉచిత ఇసుక
- డంపింగ్ యార్డుల వద్ద బ్రోకర్లదే హడావుడి
- అధికారుల నిర్లక్ష్యం.. ప్రభుత్వ పాలసీ అభాసుపాలు
- యథావిధిగానే దోపిడీకి గురవుతున్న నిర్మాణ దారులు
- పలు ప్రాంతాల్లో వైసీపీ నేతల అనుచరుల దందా
- స్టాక్ యార్డుల వద్ద వారికి సహకరిస్తున్న అధికారులు

బాపట్ల, అచ్చంపేట, తుళ్లూరు, అమరావతి, కొల్లిపర/బాపట్ల (ఆంధ్రజ్యోతి), జూలై 27: ఇసుకను ఉచితంగా అందిస్తున్నాం. నిర్దేశించిన ప్రకారమే లోడింగ్, రవాణా చార్జీలు వసూలు చేయాలి. గత ప్రభుత్వంలో జరిగినట్లు అక్రమాలు జరగడానికి వీల్లేదు. వినియోగదారులు దోపిడీకి గురి కాకూడదు. ప్రజాప్రతినిధులు, వారి బంధువులు, అనుచరులు ఇసుక విషయంలో జోక్యం వద్దు.. ప్రభుత్వానికి అప్రతిష్ఠ రాకూడదు. సామాన్యు లకు ఉచిత ఇసుక అందాలి. నిర్మాణదారులకు లబ్ధి చేకూరాలి. కూలీలకు పుష్కలంగా పనులు ఉండాలి.. అని ముఖ్యమంత్రి చంద్ర బాబు చెప్తున్నారు. అయితే ఎక్కడా కూడా చంద్రబాబు చెప్పినట్లు జరగడంలేదు. ఉచిత ఇసుకలో అక్రమాలు జరగకుండా ప్రభుత్వం నిబంధనలు విధించింది. అయితే ఆ ప్రకారం డంపింగ్ యార్డుల వద్ద ఇసుక లోడింగ్ కానీ, రవాణా కానీ జరగడంలేదు. డంపింగ్ యార్డుల వద్ద ఇసు క బ్రోకర్లదే రాజ్యమన్నట్లుగా పరిస్థితి ఉంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుక పాలసీ అభాసు పాలవుతుంది. కొందరు బ్రోకర్లు నిర్దేశించిన ప్రకారమే లోడింగ్, రవాణా జరుగుతుంది.



అమరావతి: వైకుంఠపురం రీచ్‌లో ఇసుక లోడింగ్ చేస్తున్న దృశ్యం

వందలాది లారీల ద్వారా కొందరు జేబులు నింపుకుంటున్నారు.

బుసక ముసుగులో ఇసుక

బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెంలో బుసక ముసుగులో ఇసుకను పెద్దఎత్తున తరలిస్తున్నారు. తాను అధికారపార్టీ నాయకుడ్ని అడ్డుకునే వారెవరంటూ ఓ నేత చెలరేగిపోతున్నాడు. కర్లపాలెం మండలం నల్లమోతు వారిపాలెం గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుకను తరలించారు. ప్రభుత్వం మారినా వైసీపీ ద్వితీయశ్రేణి నేతల కనుసన్నల్లో వెస్ట్ బాపట్ల మహాత్మా



వెస్ట్‌బాపట్ల పరిధిలోని మహాత్మాజీపురంలో నిల్వచేసిన ఇసుక దిబ్బలు

జీపురం శివారుల్లో రాత్రిపూట ఇసుక తరలి పోతోంది. దరివాద కొత్తపాలెం వైసీపీ నాయకులు కూడా ఇసుక దందాలో ఇంకా కీలకంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. బాపట్ల, చీరాల మండలాల సరిహద్దుల్లోని అడవి గ్రామ పంచాయతీ పరిధి ఈపూరుపాలెం స్ట్రెయిట్‌కట్ వద్ద బుసక పేరిట తవ్వి లే అవుట్లలో మెరకలకు ఉపయోగిస్తున్నారు. బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల్లో పొలాలను సైతం తవ్వి తరలిస్తున్నారు. కొన్నిచోట్ల కాల్వకట్టలను సైతం తవ్వేస్తున్నారు. బాపట్లకి చెందిన ఓ వైసీపీ నేత బినామీల ద్వారా ఉచిత ఇసుకను అక్రమంగా తెప్పించుకుని అధిక ధరకు విక్రయిస్తుండగా ఇటీవల అధికారులు దాడులు చేశారు. ఇసుక దందాలో బాపట్ల రూరల్ పరిధిలోని ఓ వైసీపీ నేతే ఇప్పుడు కూడా కీలకంగా ఉంటున్నాడు. ఇతడికి అధికారపార్టీలోని ద్వితీయశ్రేణి నేతల్లో కొందరు సహకరిస్తున్నారు. కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం, గణపవరం పరిసరప్రాంతాల్లో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. నల్లమోతువారిపాలెంలో జాతీయ రహదారి పక్కనే రెండు ఎకరాల భూమిని 8 అడుగుల ఎత్తున ఇసుకతో మెరక చేసి చుట్టూ ప్రహరీ కట్టి రియల్‌ఎస్టేట్ వ్యాపారానికి సిద్ధమయ్యారు. హైవేపై రాకపోకలు సాగించే అధికారులకు ఇది కనిపించకపోవడం విచిత్రం. పిట్టలవానిపాలెం మండలం చందోలు, రెడ్డిపాలెం, జీఎస్‌పాలెం, అల్లూరు పరిసరప్రాంతాల్లో ఇసుక అక్రమ విక్రయాలు జరుగుతున్నాయి. ఇసుకతోపాటు నల్లమట్టిని కూడా తరలిస్తున్నారు. చీరాల మండలం దేవినూతల గ్రామం నుంచి ఇసుకను తరలిస్తూ ఓ దళారి యథేచ్ఛగా వ్యాపారం చేస్తున్నాడు. బాపట్ల పరిసరప్రాంతాల్లో స్థలాల మెరక చేయాలంటే కాంట్రాక్ట్ తీసుకుని జేబులు నింపుకుంటున్నాడు. గత వైసీపీ పాలనలో ఇష్టానుసారంగా ఇసుక విక్రయాలు జరిపిన ఇతడే ప్రస్తుతం ఉన్న పాలకులను ప్రసన్నం చేసుకుని ఇసుక వ్యాపారం జోరుగా సాగిస్తున్నాడు.

- అచ్చంపేట మండలం కోనూరులో యార్డులో దూర ప్రాంతాల నుంచి వచ్చిన లారీలకు సకాలంలో లోడింగ్ జరగడం లేదు. ఆలస్యంగా వచ్చిన లారీలకు బ్రోకర్లు ముందుగా స్లిప్పులు రాయించి లోడు చేయిస్తున్నారు. ఈ విషయంలో రెండు రోజుల క్రితం గొడవలు కూడా చోటు చేసుకున్నాయి. ఓ పార్టీకి చెందిన నాయకులు బెదిరించి ఇసుక తీసుకెళ్తున్నారని తెలిసింది.
- తుళ్లూరు మండలం లింగాయపాలెం స్టాక్ పాయింట్‌లో స్థానికత పేరుతో ఓ వైసీపీ నేత అనుచరుల హవా సాగుతుంది. అడ్డదారులలో వచ్చి వాహనాలను ముందు సీరియల్‌లో పెట్టి లోడింగ్ స్లిప్‌లు ఇవ్వాలని దౌర్జన్యం చేస్తున్నారు. గతంలో ఇసుక దందాలు చేసిన ఉద్దండ్రాయుపాలెంలో వైసీపీ మాజీ ప్రజాప్రతినిధి అనుచరులు ఇప్పుడు కూడా వాహనాల్లో వచ్చి బెదిరించి టోకెన్లు తీసుకుని ఇసుకను తరలించుకుపోతున్నారు.
- కొల్లిపర ఇసుక స్టాక్ పాయింట్‌లో గందరగోళం కొన సాగుతోంది. నాయకులు తమకు ఇష్టం వచ్చిన వారికి టోకెన్లు ఇస్తున్నట్లు ఇసుక కోసం వచ్చిన వాహనదారులు శుక్రవారం తనిఖీలకు వచ్చిన జేసీ భార్గవ్ తేజ ఎదుటే వాపోయారు. ఉచిత ఇసుక విధానం బాగున్నా స్టాక్ పాయింట్లలో నాయకులు, బినామీల కారణంగా సక్రమంగా అమలు కావడం లేదన్నారు.
- అమరావతి మండలం వైకుంఠపురం రీచ్‌లో నేతల బంధువులు, వారి అనుచరులు ఇసుక లోడింగ్‌కు వాహనాలు రాకముందే వేర్వేరు ఆధార్ నెంబర్లతో బుక్ చేసుకుంటున్నారు. అదనంగా రూ.వెయ్యి ఇచ్చిన వారికి ఇసుకను విక్రయిస్తున్నారు. ఇలా కొనుగోలు చేసి గుంటూరుకు తీసుకెళ్లిన ఇసుకను రూ.16 వేల వరకు విక్రయిస్తున్నారు. 20 టన్నుల ఇసుక గుంటూరుకు 12 వేలకు చేర్చాల్సి ఉండగా వాహన యజమానులు అధికంగా వసూలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం వచ్చిన వాహనాలు సరియైన సమయంలో లోడింగ్ కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ హయాంలో ఇసుక మాఫియాలో పాలుపంచుకున్న వారు ప్రస్తుతం పార్టీ మారి రీచ్‌ల్లో తిష్ఠ వేసి ఇసుక దందా కొనసాగిస్తున్నారు.



కొల్లిపర ఇసుక స్టాక్ పాయింట్‌లో శుక్రవారం లోడింగ్ చేసే విధానాన్ని పరిశీలిస్తున్న జేసీ భార్గవ్‌తేజ



అచ్చంపేట: కోనూరులో ఇసుక డంపింగ్ యార్డులో లారీలకు లోడు చేస్తున్న దృశ్యం

అమరావతితో.. ఉపాధికి చర్యలు

- రాజధాని ద్వారా వచ్చే ఏ అవకాశాన్ని వదులుకోం
- నిరుద్యోగ యువతని సన్నద్ధం చేసేందుకు చర్యలు
- నిర్మాణ రంగంలోనే ఎక్కువగా ఉపాధి అవకాశాలు
- 'ఆంధ్రజ్యోతి'తో కలెక్టర్ నాగలక్ష్మి



కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి నిరుద్యోగ యువత వేరే ప్రాంతాలకు రూ.15 వేల వేతనానికి వెళ్లి అక్కడ అనేక ఇబ్బందులు పడుతున్నారు. సంపాదించినది ఆహారం, వసతికే ఎక్కువగా ఖర్చు అవుతున్నది. ఇక్కడ వృత్తి నైపుణ్యంలో శిక్షణ పొంది వేరే చోట ఉద్యోగాలు చేస్తోన్న వారి అభిప్రాయాలను సేకరించాం. ఆ జీతమేదో ఇక్కడే వచ్చేలా చూస్తే తాము సొంత జిల్లాల్లోనే పని చేసుకుంటామని చెబుతున్నారు. మనకు అమరావతి రాజధానిలో వచ్చే ఉపాధి అవకాశాలు తప్ప ఇతర ప్రాంతాల్లో అంతగా కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో రాజధానిలో ఉద్యోగ కల్పనకు సంబంధించి వచ్చే ఏ ఒక్క అవకాశాన్ని కూడా వదులుకోకూడదు. ఆ దిశగా యువతకు శిక్షణ ఇచ్చి సిద్ధం చేసేందుకు కార్యచరణ ప్రణాళిక రూపొందిస్తున్నాం.. అని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి చెప్పారు. శనివారం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆమె మాటల్లోనే..

బిల్డర్లతో మాట్లాడుతున్నాం

జిల్లాలో ఇప్పటికే కొంతమంది బిల్డర్లను పిలిపించి మాట్లాడాం. వారికి ఏ రంగంలో నైపుణ్యం కలిగిన యువతీ, యువకులు అవసరమో తెలుసుకున్నాం. ఆయా రంగాలపై చదువు పూర్తి చేసుకున్న వారికి శిక్షణ ఇప్పించేందుకు కార్యక్రమాలు రూపొందించాల్సిందిగా స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ అధికారులను ఆదేశించాం. మరికొద్ది రోజుల్లో అమరావతి రాజధానిలో నిర్మాణాలు ప్రారంభం అవుతాయి. అప్పుడు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా అందుబాటులోకి వస్తాయి. వాటిని అందిపుచ్చుకునేందుకు యువతను సిద్ధం చేస్తున్నాం.

ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు..

జిల్లాలోని యువతకు ఉపాధి నిమిత్తం పారిశ్రామికవాడ(ఇండస్ట్రియల్ పార్కు)ని ఏర్పాటు చేయడానికి ఉన్న అవకాశాలను ఆలోచిస్తున్నాం. కనీసం 20 ఎకరాల భూమి అయినా కావాలి. ఇందుకోసం అసైన్డ్‌భూములను పరిశీలిస్తున్నాం. మరోవైపు భూమి విలువ ఎక్కువగా ఉన్నందున అంత పెద్దమొత్తం పెట్టి కొనుగోలు చేసి పార్కుని ఏర్పాటు చేయడం ఏపీఐఐసీకి సాధ్యపడదు. పరిశ్రమల ఏర్పాటుని ప్రోత్సహించేందుకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 162 క్లెయిమ్‌లకు రూ.8.44 కోట్లు మంజూరు చేశాం.

ఇసుకపై పర్యవేక్షణ

ఇసుక సరఫరాకు సంబంధించి నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. సమస్యలపై స్వీకరించేందుకు కంట్రోల్ రూం ఏర్పాటు చేసినా స్పందించడం లేదు. తాళ్లాయపాలెంలో స్టాక్‌యార్డు వద్ద రోడ్డు సమస్య ఉన్నది. దానిని సత్వరమే పరిష్కరించాల్సిందిగా ఆర్డీవోకు ఆదేశాలు ఇచ్చాం. లింగాయపాలెంతో పాటు ఇతర చోట్ల కూడా లారీలు సీరియల్ నెంబరులో కాకుండా ఎలా పడితే అలా స్థానికత బలాన్ని ఉపయోగించి చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఈ విషయంలో కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించాం. చిర్రావూరు, ప్రాతూరులో రాత్రి వేళ ఇసుక తవ్వకాలపై చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తాం.

రోడ్లు, బ్రిడ్జీలు పూర్తికి చర్యలు

వివిధ ప్రాంతాల నుంచి నగరంలోకి రోడ్ల కనెక్టివిటీ చక్కగా ఉండేలా చర్యలు చేపడుతున్నాం. రైల్వే ఓవర్ బ్రిడ్జీలు, అండర్ బ్రిడ్జీలు రైల్వే శాఖనే పూర్తి చేసేలా కేంద్రానికి నివేదించాల్సిందిగా ప్రజాప్రతినిధులకు కోరుతున్నాం.

వర్షాలపై అప్రమత్తం

వర్షాలు కురుస్తూ నదులు, చెరువుల్లోకి కొత్త నీరు వస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. దీంతో నీటిని మరింతగా శుద్ధి చేయాలని మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించాం. ఆస్పత్రుల్లో చికిత్సల కోసం వస్తున్న వారి వివరాలను ఎప్పటికప్పుడు సేకరిస్తున్నాం. డయేరియా ప్రబలినట్లుగా ఎక్కడా బయటపడలేదు.

నకిలీ విత్తనాలపై దృష్టి

వ్యవసాయ పనులు ప్రారంభమైనందున మార్కెట్‌లో ఎక్కడా నకిలీ విత్తనాలు రైతులకు విక్రయం జరగకుండా చూస్తున్నాం. వ్యవసాయ అధికారులతో తనిఖీలు చేయిస్తున్నాం. ఇప్పటివరకు రైతుల నుంచి ఫిర్యాదులు రాలేదు. బయో పురుగుమందులను అరికట్టే విషయంలో నిబంధనలు అస్పష్టంగా ఉన్నాయి. దీనిపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

మందకొడిగా.. ఖరీఫ్ సాగు

- ఇంకా 50 శాతానికి చేరుకోని నాట్లు
- ఆగస్టు రెండో వారానికి పూర్తి అవుతాయని అంచనా
- పట్టిసీమ ద్వారా నీటి లభ్యత ఉందని అధికారులు భరోసా

గుంటూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో నాట్లు మందకొడిగా సాగుతున్నాయి. కృష్ణా పశ్చిమడెల్టా, గుంటూరు ఛానల్‌లో కాల్వలకు నీటి విడుదలలో కొంత ఆలస్యంకావడం, ఇప్పుడిప్పుడే వర్షాలు పుష్కలంగా కురుస్తుండటంతో రైతులు విత్తనాలు నాటేందుకు ఉపక్రమిస్తున్నారు. పట్టిసీమ ద్వారా డెల్టాకు అవసరమైన సాగునీటిని అందిస్తామని అధికారులు రైతులకు భరోసా కల్పిస్తున్నారు. మరోవైపు బ్యాంకర్ల సమావేశాన్ని ఏర్పాటుచేసి ఈ ఏడాది వ్యవసాయరుణాలు పుష్కలంగా ఇవ్వాలని కోరిన దృష్ట్యా వచ్చే నెల రెండో వారం ముగిసేనాటికి నాట్లు దాదాపుగా 90శాతం వరకు పూర్తవుతాయని భావిస్తున్నారు. జిల్లాలో అన్ని పంటలు కలిపి 1,25,914 హెక్టార్లలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేస్తుంటారు. ఇప్పటివరకు 46,402 హెక్టార్లలో నాట్లు పూర్తైనట్లు మండల వ్యవసాయశాఖ అధికారుల నుంచి జిల్లా వ్యవసాయశాఖకు గణాంకాలు చేరాయి. వీటిల్లో ఎక్కువగా వరినాట్లే ఉన్నాయి. గతంలో వలే నారుమడులు పెట్టుకోవడాన్ని రైతులు మానేసి నేరుగా విత్తనాలు నాటే పద్ధతికి మారిపోయారు. ఈ కారణంగా 29,336 హెక్టార్లలో వరినాట్లు పూర్తి అయ్యాయి. ఇంకా 35వేల హెక్టార్లలో వరినాట్లు వేయాల్సిఉన్నది. జిల్లాలో పంటలసాగులో రెండోస్థానంలో నిలిచే పత్తి సాధారణ విస్తీర్ణం 26,982 హెక్టార్లు కాగా ఇప్పటివరకు 10,057హెక్టార్లలో నాట్లు పూర్తిచేశారు. మిర్చి విషయంలోనే తాత్సారం జరుగుతున్నది. మిర్చివిత్తనాలు కొనుగోలు చేసి నర్సరీల్లో మొక్కలు పెంచి వాటిని తీసుకొచ్చి నాటాల్సి ఉన్నది. ఇందుకోసం 20రోజుల నుంచి నెలవరకు సమయం పడుతుంది. 20,625 హెక్టార్లలో మిర్చిసాగు ఏటా జరుగుతుంటుంది. ఇప్పటివరకు 29హెక్టార్లలో మాత్రమే నాట్లు పూర్తయ్యాయి. పసుపు విషయానికి వస్తే 1,671 హెక్టార్లకు 923 హెక్టార్లలో నాట్లు వేశారు. జూట్, సోయాబీన్, పశుగ్రాసం, కూరగాయలు, ఇతర పంటలు, టమాటాలు కూడా 50శాతం లోపే నాట్లు వేశారు.

అధిక వర్షపాతం నమోదు

వాతావరణాన్ని పరిగణనలోకి తీసుకుంటే జూన్, జూలై నెలల్లో ఇప్పటివరకు సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. కృష్ణానదికి ఎగువ ప్రాజెక్టుల నుంచి వరద రావడం లేదు. కేవలం స్థానికంగా కురిసిన వర్షంతో చిన్న వాగుల నుంచి వరద వస్తున్నది. అయితే ప్రభుత్వం ముందుచూపుతో వృథాగా సముద్రంలో కలిసిపోతున్న గోదావరి వరదనీటిని పట్టిసీమ ద్వారా ఇక్కడికి తరలిస్తున్నది. ఈనెల 10నుంచి కాల్వలకు నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. అయితే మెయిన్ కెనాల్ సామర్థ్యం 8,162 క్యూసెక్కులు కాగా ప్రస్తుతానికి 300క్యూసెక్కులు మాత్రమే విడుదల చేస్తున్నారు. గుంటూరు ఛానల్‌కు ఇంకా నీటిని విడుదల చేయడాన్ని ప్రారంభించలేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున రైతులనుంచి సాగునీటి కోసం పెద్దగా డిమాండ్ లేకపోవడంతో తక్కువగానే నీటిని విడుదల చేస్తున్నారు.

పింఛన్ల నగదు విడుదల

- ముందస్తుగా రూ.110.69 కోట్లు విడుదల
- ఉదయం 6 గంటల నుంచే పంపిణీకి ఆదేశాలు
- నిర్లక్ష్యంగా ఉండే ఉద్యోగులపై చర్యలు : డీఆర్‌డీఏ పీడీ హెచ్చరిక

గుంటూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు నెల ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి అవసరమైన నిధులను నాలుగు రోజులు ముందుగానే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలోని 17 మండలాలు, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, నాలుగు మున్సిపాలిటీలలోని 2,60,192 మందికి రూ.110.69 కోట్లు విడుదలయ్యాయి. దీని దృష్ట్యా ఆగస్టు ఒకటో తేదీన ఉదయం 6 గంటలకే సచివాలయాల ఉద్యోగులు పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్‌ని పంపిణీ చేయాలి. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్ హెచ్చరించారు. ఆగస్టులో ఒక్కొక్క ఉద్యోగి 50 నుంచి 100 పింఛన్లు పంపిణీ చేసేలా కార్యచరణ ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. తొలి రోజు ఉద్యోగులు పింఛన్ల పంపిణీకి వెళ్లినప్పుడు అందుబాటులో లేని లబ్ధిదారుల కోసం రెండో తేదీ వరకు పంపిణీ చేస్తారని చెప్పారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న లబ్ధిదారులు ఒకటో తేదీ నాటికి స్వగ్రామాల్లో ఉండేలా సమాచారం ఇవ్వాలని ఉద్యోగులకు సూచించారు.

యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలి

● విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య


రక్తదానం చేసిన విద్యార్థులతో డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు(విద్య), జూలై 27: రక్తదానం ప్రాణదానంతో సమానమని, యువత రక్తదానానికి ముందుకు రావాలని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య పిలుపునిచ్చారు. శనివారం డాక్టర్ లావు రత్తయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని ఎన్ ఎస్ఎస్ విభాగం వారు జీజీహెచ్ గుంటూరు, నీడ్స్ బ్లడ్ బ్యాంక్, లైఫ్ షేర్, తలసేమీయా నీడ్స్ బ్లడ్‌బ్యాంక్‌ల సంయుక్త ఆధ్వర్యంలో యూనివర్సిటీలో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రతి రెండు సెకన్లకు ఎక్కడో ఓ చోట ఎవరో ఒకరికి రక్తం అవసరం అవుతూనే ఉన్నదని తెలిపారు. విద్యార్థులు తాము రక్తదానం చేయడంతోపాటు మిత్రులను కూడా ఈ మహత్తర కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని కోరారు. రక్తదానం చేశాక శరీరం తాను కోల్పోయిన రక్తాన్ని 48 గంటల్లోగా తిరిగి భర్తీ చేసుకుంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లమడ ఆధునీకరించి గుంటూరు చానల్ పొడిగించేందుకు కృషి

● రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

బాపట్ల, జూలై 27: కోస్తా జిల్లాల ప్రధాన సమస్యగా ఉన్న నల్లమడ డ్రెయిన్ ఆధునీకరణతోపాటు గుంటూరు చానల్ పొడిగించేందుకు కృషి చేస్తానని రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. వ్యక్తిగత పనుల నిమిత్తం తన స్వగ్రామమైన బాపట్ల మండలం నరసాయపాలెం గ్రామానికి శనివారం వచ్చిన ఆయన తిరుగు ప్రయాణంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో కలిసి మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ప్రధాన సమస్యగా నల్లమడ ఉందన్నారు. గతంలో చంద్రబాబునాయుడు ఆధునీకరణకు కేటాయింపులు చేసినప్పటికి ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్మోహనరెడ్డి వాటిని నిలుపుదల చేశారన్నారు. డ్రైనేజి వ్యవస్థ అంతా అస్థవ్యస్తమైపోయిందన్నారు. పంటపొలాలకు నీరందని పరిస్థితి ఏర్పడిందన్నారు. వీటన్నిటిపై సమగ్ర చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. ముఖ్యమంత్రితో మాట్లాడి చర్యలు తీసుకుంటామని చెప్పారు. గుంటూరు ఛానల్ పొడిగించటంతోపాటు మెట్టపొలాలకు ఎత్తిపోతల పథకాలు కూడా ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై కూడా దృష్టి సారిస్తామన్నారు. ప్రభుత్వానికి కొంత ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నాయన్నారు.నిధులన్ని సమీకరించుకుంటూ ఒకవైపు అప్పులు తీర్చుకుంటూ మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలు చేయాల్సిఉందన్నారు. ఎన్డీయే సహకారంతో నిధులు సమీకరించి రైతాంగ సమస్యలు పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

మండల్ సిఫార్సులను పూర్తిస్థాయిలో అమలు చేయాల్సిందే

● ఆగస్టు 7న చలో అమృత్‌సర్‌ను విజయవంతం చేయాలి
● ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

గుంటూరు, జూలై 27: మండల్ కమిషన్ సిఫార్సులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో అమలుచేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. నల్లపాడు రోడ్డులోని సంఘం కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆగస్టు 7న మండల్‌డే సందర్భంగా పంజాబ్ అమృత్‌సర్‌లో జరగనున్న అఖిల భారత జాతీయ ఓబీసీ 9వ మహాసభకు బీసీలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపిస్తూ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. బీసీ సబ్‌ప్లాన్ ద్వారా బడ్జెట్లో కేటాయింపులు జరపాలన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా కులజనగణన పారదర్శకంగా చేపట్టాలని కోరారు. విద్య, ఉద్యోగాలలో అమలవుతున్న 27శాతం రిజర్వేషన్లను, బీసీల జనాభా దామాషా మేరకు పెంచాలన్నారు. చట్టసభల్లోనూ ఆ మేరకు రిజర్వేషన్లు ఇచ్చేలా పార్లమెంటు చట్టాలు చేయాలని కోరారు. ఆగస్టు 7 రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో బీపీ మండల్ చిత్రపటానికి జిల్లా అధ్యక్షుల నేతృత్వంలో ఘనంగా నివాళులర్పించాలని పిలుపునిచ్చారు. ఓబీసీ సంఘం జాతీయ ప్రధానకార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు మాట్లాడారు. సమావేశంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తన్నీరు ఆంజనేయులు, రాష్ట్ర యువజన ప్రధానకార్యదర్శి కె.హనుమంతు, పి.మహేష్, బీసీ నాయకులు పాల్గొన్నారు.


మంచినీటి చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చేయటమే లక్ష్యం

● త్వరలో పేట ప్రజలకు అందుబాటులోకి మినరల్ వాటర్
● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూలై 27: గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా రెండు మూడు నెలలుగా పట్టణవాసులకు ఏర్పడిన తాగునీటి సమస్యకు చరమగీతం పాడనున్నామని, పట్టణ వాసులకు తాగునీటి సమస్య లేకుండా చేయటమే తన ప్రథమ లక్ష్యమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శనివారం మంచి నీటి చెరువు వద్ద మోటార్ల ద్వారా నీటిని నింపుతున్న పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేట తాగునీటి సమస్యను నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకు వెళ్లామని, ఐదు టీఎంసీల నీరు పట్టణ వాసుల తాగునీటి అవసరాలకు సరి పోవని, మరో మూడు టీఎంసీల నీరు అదనంగా కావాలని అడిగి వారిని ఒప్పించామన్నారు. నీటి విడుదల వచ్చే నెల 6వ తేదీ వరకు ఉంటుందని ప్రత్తిపాటి తెలిపారు. ఇక నుంచి పట్టణంలోని మెరక ప్రాంతాల్లో కూడా నీటి సమస్య లేకుండా నీటి పరిమాణాన్ని పెంచి సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్‌టీఆర్ సుజల ద్వారా రూ.2కే మినరల్ వాటర్‌ను ఆగస్టు 10వ తేదీ నుంచి పట్టణ, పరిసర ప్రాంతాల్లో ఉన్న 25 ఔట్‌లెట్‌ల ద్వారా ప్రజలకు అందించే ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. టిడ్కో నివాస గృహాల విషయంలో కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, అందులో భాగంగానే పట్టణ సీఐని పల్లెనిద్ర చేయాలని ఆదేశించామని, త్వరలో తాను కూడా స్వయంగా టిడ్కో గృహాల వద్ద పల్లెనిద్ర చేస్తానని తెలిపారు. టిడ్కో గృహాల వద్ద అసాంఘిక కార్యకలాపాలు జరిగితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. నాడు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ 52 ఎకరాల సముదాయంలో కట్టిన 4500 ఇళ్ళను అర్హులకే అందించి ప్రజలు ఇక్కడ నివాసం ఉండేలా చర్యలు తీసుకోనున్నట్టు ప్రత్తిపాటి తెలిపారు.'

సమాజ హితమే యువ ఇంజనీర్ల లక్ష్యం కావాలి

● మేక్ ఇన్ ఇండియా ఆలోచనలతో ముందుకు సాగండి
● ఇస్రో డైరెక్టర్ బీఎన్ రామకృష్ణ
● అట్టహాసంగా ఆర్వీఆర్‌జేసీలో గ్రాడ్యుయేషన్ డే

గుంటూరు(విద్య), జూలై 27: యువ ఇంజనీర్లు సమాజ హితం కోసం పనిచేస్తూ, మేక్ ఇన్ ఇండియా ఆలోచనలతో ముందుకుసాగాలని ఇస్రో డైరెక్టర్ బీఎన్ రామకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం చౌడవరంలోని ఆర్వీ ఆర్‌అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన 36వ బ్యాచ్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్‌డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. యువత ప్రతి సమస్యను ఛాలెంజ్‌గా తీసుకుని దాని పరిష్కారం కోసం కృషిచేయాలని రామకృష్ణ అన్నారు. స్వతంత్ర ఆలోచనలు, సమష్టికృషి ఎంతోముఖ్యమని సూచించారు. ప్రపంచస్థాయిలో అంతరిక్ష పరిశ్రమలో 300 బిలియన్ డాలర్ల వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయని, ఇందులో భారతదేశ వాటా కేవలం 2శాతం మాత్ర మేనని దీనిని మరింతపెంచేలా నేటి యువత కృషి చేయాలన్నారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య కంచర్ల గంగాధర్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ప్రపంచస్థాయి నైపుణ్యాలను అందిపుచ్చుకున్నవారికే మెరుగైన అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు శ్రీ జాగర్లమూడి మురళీ మోహన్, డాక్టర్ జగదీశ్ కుమార్ మద్దినేని, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎస్‌వీ శ్రీనివాసరావు, డీన్స్, వివిధ శాఖల విభాగాధిపతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ బ్రాంచీల్లో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్, కోర్సులు పూర్తిచేసుకున్న విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు.


చదువులో ప్రతిభ చూపిన విద్యార్థినికి గోల్డ్‌మెడల్, సర్టిఫికెట్ అందజేస్తున్న ఇస్రో డైరెక్టర్ రామకృష్ణ, ఏఎన్‌యూ వీసీ గంగాధర్, డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తదితరులు

వికటించిన వైద్యం.. ఒకరి మృతి

ఆర్ఎంపీపై పోలీసులకు బంధువుల ఫిర్యాదు




ఆర్ఎంపీ మల్లికార్జునరెడ్డి

శ్రీను మృతదేహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన, ఇన్‌సెట్‌లో శ్రీను మృతదేహం

వినుకొండటౌన్, నూజండ్ల, జూలై 27: వైద్యం వికటించి ఓ రైతుకూలీ మృతి చెందిన సంఘటన వినుకొండలో శనివారం చోటు చేసుకుంది. మృతుడి బంధువులు సమాచారం మేరకు వివరాలు.. నూజండ్ల మండలం బుర్రిపాలెం గ్రామానికి చెందిన తాటి శ్రీను (30) గొర్రెలు కాసుకునేవాడు. ఈ క్రమంలో కాలి బొటన వేలుకు గాయం కాగా బుర్రిపాలెం సమీపంలోని రవ్వారంలోని ఆర్ఎంపీ సిహెచ్.మల్లికార్జునరెడ్డి వద్దకు చికిత్సకు వెళ్లాడు. గాయానికి వైద్యం చేసి, అనంతరం నొప్పికి ఇంజక్షను చేశాడు. కొద్ది సేపటికి శ్రీనుకు ఒళ్ళంతా మంటలు రావడంతో పాటు, ఒంటిపై బొబ్బలు వచ్చి, ఒక్కసారిగా స్పృహతప్పి పడిపోయాడు. దీంతో ఆర్ఎంపీ వెంటనే శ్రీనును ఆటోలో వినుకొండ వైద్యశాలకు తరలించాడు. అప్పటికే శ్రీను మృతి చెందాడని వైద్యులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు, శ్రీను బంధువులు పెద్ద సంఖ్యలో వినుకొండ వైద్యశాల వద్దకు చేరుకున్నారు. శ్రీనుకి భార్య ఆదిలక్ష్మి, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆర్ఎంపీపై చర్యలు తీసుకోవాలని శ్రీను కుటుంబ సభ్యులు నూజండ్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పరారీలో ఆర్ఎంపీ

శ్రీను మృతి చెందాడని సమాచారం మేరకు బంధువులు పెద్ద సంఖ్యలో వినుకొండ ఆస్పత్రి వద్దకు చేరుకోవడంతో ఆర్ఎంపీ అక్కడ నుంచి పరారయ్యాడు. తన బావమరిది సాయంతో రాజీకి ప్రయత్నించినప్పటికీ శ్రీను బంధువులు ససేమిరా అన్నారు. ఆర్ఎంపీ మల్లికార్జునరెడ్డి నరసరావుపేట పార్లమెంట్ వైసీపీ వైద్యవిభాగం జనరల్ సెక్రటరీ.

ఆర్ఎంపీని కఠినంగా శిక్షించాలి : ఎమ్మెల్యే జీవీ

తెలిసీతెలియని వైద్యంతో పేద రైతు కూలీని బలితీసుకున్న ఆర్ఎంపీ మల్లికార్జునరెడ్డిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. జీవీ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి శ్రీను మృతదేహాన్ని సందర్శించి కుటుంబసభ్యులను పరామర్శించారు. న్యాయం చేస్తామని వారికి హామీ ఇచ్చారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఎక్స్పైరీడేట్ ఇంజక్షన్ చేయడంతో అది వికటించి చనిపోయాడన్నారు. జనసేన పార్టీ నాయకులు కొణిజేటి నాగ శ్రీను, మండల అధ్యక్షుడు మురళీకృష్ణయాదవ్, మీసాల ఆంజనేయులు, గురునాథం, సోమేపల్లి బ్రహ్మయ్య, రోడ్డా వీరాంజనేయరెడ్డి, గంగినేని బాబు, ఎర్రయ్య తదితరులు వారి వెంట ఉన్నారు.

తెనాలికి చేరుకున్న హారిక మృతదేహం

● ఈ నెల 20న అమెరికాలో కారు ప్రమాదంలో మృతి
● ఐతానగర్‌లోని స్వగృహం వద్ద అంత్యక్రియలు పూర్తి
● శోకసంద్రంలో మునిగిన కుటుంబీకులు, బంధువులు


తెనాలి ఐతానగర్‌లో హారిక మృతదేహం వద్ద రోధిస్తున్న కుటుంబసభ్యులు, ఇన్‌సెట్లో హారిక ఫైల్‌ఫోటో

తెనాలి రూరల్, జూలై 27: ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన తెనాలికి చెందిన విద్యార్థిని జెట్టి హారిక(25) అక్కడి హైవేపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతిచెందింగా ఆమె భౌతికకాయం శనివారం తెనాలికి చేరుకుంది. ఆమె మృతదేహాన్ని స్వస్థలానికి తెప్పించేలా సహాయం అందించాలని కుటుంబసభ్యులు కేంద్రసహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కోరారు. దీంతో స్పందించిన వారు తగిన ఏర్పాట్లు చేయగా శనివారం హారిక భౌతికకాయం తెనాలి చేరింది.

తెనాలి ఐతానగర్‌కు చెందిన హారిక గత సంవత్సరం ఆగస్ట్‌లో న్యూట్రిషన్ ఫుడ్ సైన్స్‌లో మాస్టర్స్ చేసేందుకు అమెరికా వెళ్లారు. యూనివర్సిటీ నుండి కారులో ఇంటికి వస్తుండగా ఈ నెల 20న కౌంటీలోని ఒకహోమా హైవేపెట్రోల్-74 దగ్గర వరుసగా మూడు కార్లు ఢీకొనడంతో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రయాణంలో హారిక అక్కడికక్కడే మరణించింది. కాంట్రాక్ట్ ఉద్యోగి అయిన ఆమె తండ్రి ఆర్థిక స్తోమతలేకున్నా కూతురి ఉన్నత చదువుల కోసం అప్పుచేసి మరీ అమెరికాకు పంపారు. ఉన్నత విద్యనభ్యసించి గొప్ప స్థాయిలో తిరిగివస్తుందని ఆశించిన తల్లిదండ్రులు, కుటుంబసభ్యులకు హారిక మృతి తీరనిశోకాన్ని మిగిల్చింది. హారిక భౌతికకాయం వద్ద తల్లిదండ్రులు, సోదరుడు, కుటుంబసభ్యులు రోధిస్తున్న తీరు పలువురిని కంటతడిపెట్టించింది. దీంతో ఆ ప్రాంతమంతా విషాద చాయలు అలుముకున్నాయి.

అంత్యక్రియలు పూర్తి

అమెరికాలో ఉన్నత చదువుల కోసం వెళ్లి ప్రమాదవశాస్తూ మృతి చెందిన తాడిబోయిన రవితేజ, జెట్టి హారిక భౌతికకాయాలకు శనివారం అంతిమయాత్ర నిర్వహించి ఆయా కుటుంబసభ్యులు దహన సంస్కారాలు పూర్తిచేశారు. ఆ కార్యక్రమాలలో కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆగస్టు 12, 13 తేదీల్లో నడికుడి రైలు మార్గంలో ట్రాఫిక్ బ్లాక్

● రైళ్ల దారి మళ్లింపు, రీషెడ్యూల్

గుంటూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 12, 13 తేదీల్లో నడికుడి రైలుమార్గంలోని విష్ణుపురం-కొండ్రపోలు మధ్యన ట్రాఫిక్‌ని బ్లాక్ చేస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఆయా తేదీల్లో నెం.17646 రేపల్లె-సికింద్రాబాద్ నాలుగు గంటల ఆలస్యంగా బయలుదేరుతుందన్నారు. నెం.17230 సికింద్రాబాద్-త్రివేండ్రం సెంట్రల్ శబరి ఎక్స్‌ప్రెస్ 75 నిమిషాల ఆలస్యంగా రీషెడ్యూల్ చేస్తామన్నారు. నెం.07222 సంత్రగచి-సికింద్రాబాద్ రైలు ఆగస్టు 11న, నెం.07221 సికింద్రాబాద్-సంత్రగచి స్పెషల్ ఆగస్టు 13న నడికుడి మార్గంలో కాకుండా విజయవాడ, వరంగల్, కాజీపేట మీదగా దారి మళ్లిస్తామన్నారు. నెం.12805 విశాఖపట్టణం-లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ని ఆగస్టు 12, 13 తేదీల్లో మార్గమధ్యంలో 45 నిమిషాల పాటు క్రమబద్ధీకరించడం జరుగుతుందన్నారు. ఈ మార్పులను ప్రయాణీకులు గమనించి రైల్వేకి సహకరించాలని సీపీఆర్‌వో విజ్ఞప్తి చేశారు.

కాచిగూడ - తిరువన్నామలై రైలులో చోరీ

● మహిళ మెడలో బంగారు చైన్ లాక్కెళ్ళిన దొంగ

రాజుపాలెం, జూలై 27: కాచిగూడ నుంచి తిరువన్నామలై వెళ్ళే రైలులో చోరీ జరిగిన సంఘటన మండలంలోని రెడ్డిగూడెం సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. నడికూడి రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు శనివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సికింద్రాబాద్‌లోని శ్రీకృష్ణనగర్‌కు చెందిన బీశెట్టి దేవీప్రియ తన కుటుంబంతో కలసి కాచిగూడ - తిరువన్నామలైలో అరుణాచలం వెళ్తున్నారు. వీరు ఎస్-2 బోగీలో ప్రయాణిస్తున్నారు. రాత్రి 12:50 గంటల సమయంలో ఈ రైలుకు రెడ్డిగూడెంలో క్రాసింగ్ ఉండటంతో రైలు ఆగింది. క్రాసింగ్ అయి పోగానే 12:55, ఒంటి గంట సమయంలో రైలు కదిలింది. ఆ సమయంలో దొంగ చాకచక్యంగా దేవీప్రియ మెడలో ఉన్న 29 గ్రాముల బంగారపు చైన్‌ను తెంచుకొని ట్రెయిన్ దిగి పరారయ్యాడు. ఆమె కేకలువేయటంతో అప్పటికే ట్రెయిన్ కదలటం జరిగిపోయింది. ఈ సంఘటనపై ఆమె గుంటూరు రైల్వే స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు నడికూడి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

రాజీకి పిలిచినందుకు దాడి

● ఆరుగురు నిందితుల అరెస్టు

తెనాలి, మారీసుపేట జూలై 27: కేసు విషయంలో రాజీకి పిలిచినందుకు దాడి చేసిగాయపర్చిన నిందుతులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రమేష్ తెలిపారు. త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో శనివారం విలేకరల సమావేశంలో నిందుతుల వివరాలను డీఎస్పీ వెల్లడించారు. దోమ రాకేష్‌పై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైందని, దానిలో ఫిర్యాదిదారు అయిన తలవరస విజయ్ బాబును కేసును రాజీపడమని రాకేష్ పలుమార్లు అడిగాడని తెలిపారు. ఈసారి రాజీకి రమ్మని అడిగితే నిన్ను చంపుతానని విజయ్ బాబు గతంలో బెదిరించాడు. ఈ క్రమంలో ఈ నెల 21వ తేదీ సాయంత్రం 6 గంటల సమయంలో సుల్తానాబాదు సుందరయ్య నగర్ కాలనీలో రాకేష్ తన స్నేహితుడు ఏడుకొండలుతో ఉన్న సంగతి తెలుసుకొని విజయ్‌బాబు మిగతా నిందితులను కలుపుకొని రాకేష్‌ను చంపాలనే ఉద్దేశంతో మారణాయుధాలతో దాడి చేశారన్నారు. వారిపై ముకుమ్మడిగా రాడ్లు, కర్రలతో, రాళ్ళతో విచక్షణా రహితంగా కొట్టగా దోమ రాకేష్ తీవ్రంగా గాయపడ్డాడు. రాకేష్‌ను అతని స్నేహితుడు ఏడుకొండలును చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. ఆదే రోజు త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. శనివారం ఏ1 నిందితుడైన తలవరస విజయ్‌బాబు ఇంటిదగ్గర మొత్తం ఆరుగురు నిందుతులను త్రీటౌన్ ఎస్సై ప్రకాష్‌రావు అరెస్ట్ చేశారని తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ రమేష్ మాట్లాడుతూ ఈ ఆరుగురు నిందుతులలో ఇద్దరు పలు నేరాలలో నిందుతులని, వారిపై రౌడీషీట్ కూడా ఉందన్నారు. ఇటువంటి వారిపై పీడీ యాక్ట్‌ను, అవసరమైతే నగర బహిష్కరణను కూడా విధిస్తామని హెచ్చరించారు. నిందితులను పట్టుకున్న త్రీటౌన్ సీఐ రమేష్‌బాబును, ఎస్సై ప్రకాష్‌రావును, పోలీసు సిబ్బందిని డీఎస్పీ రమేష్ అభినందించారు.

ప్రభుత్వ టెక్స్‌టైల్ పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు(విద్య), జూలై 27: నల్లపాడులోని ప్రభుత్వ టెక్స్‌టైల్ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాధాకృష్ణ శనివారం ఒక ప్రకనటలో తెలిపారు. పాలిసెట్ అర్హత సాధించకపోయినా పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 29వ తేదీ లోపు తమ దరఖాస్తులతో పాటు సంబంధిత సర్టిఫికెట్ జిరాక్స్‌ను జత చేసి కళాశాలలో సమర్పించాలని సూచించారు. పాలిసెట్ 2024 హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, పదవ తరగతి మార్కుల జాబితా, పదవ తరగతి టీసీ, 4వ తరగతి నుండి పదవ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, కులధ్రువీకరణ పత్రం, ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని సూచించారు. ఇందుకు ప్రాసెసింగ్ ఫీజు ఓసీ, బీసీలకు రూ.700 ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని సూచించారు. అదేవిధంగా కళాశాల ఫీజు రూ.4700 చెల్లించాలని తెలిపారు. స్పాట్ అడ్మిషన్‌కి వచ్చే విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు మూడు సెట్లు జిరాక్స్ కాపీలు తప్పకుండా తీసుకుని రావాలని పేర్కొన్నారు. ఎటువంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం ఉండదని స్పష్టం చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.80 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

అందరి సహకారంతోనే నగర అభివృద్ధికి కృషి

● బదిలీ అయిన కమిషనర్ కీర్తి చేకూరికి ఘన సత్కారం

గుంటూరు(కార్పొరేషన్), జూలై 27 : గుంటూరు నగర కమిషనర్‌గా పూర్తి సంతృప్తిగా విధులు నిర్వహించామని, తమ విధి నిర్వహణలో అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో నగర అభివృద్ధికి కృషి చేశామని ఏపీ ట్రాన్స్‌కో జేఎండీగా బదిలీ అయిన కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో బదిలీ అయిన కీర్తి చేకూరికి శనివారం అధికారులు, ప్రజా ప్రతినిధులు వీడ్కోలు, అభినందన సభ నిర్వహించారు.

అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో కీర్తి చేకూరి మాట్లాడుతూ గుంటూరు నగర కమిషనర్‌గా 2 ఏళ్ల 3 నెలల కాలం ఎంతో సంతృప్తిగా విధులు నిర్వహించామన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు నగర అభివృద్ధికి ఎంతగానో సహకరించారని, ప్రధానంగా రోడ్ల విస్తరణ, కాలనీల్లో పార్కుల అభివృద్ధికి కృషి చేశామన్నారు. నగరపాలక సంస్థ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రమాద బీమా కల్పించడం తనకు వ్యక్తిగతంగా ఎంతో సంతోషాన్ని అందించిందన్నారు. సాధారణ ఎన్నికలు కూడా ఏ విధమైన అవాంతరాలు లేకుండా దిగ్విజయంగా చేపట్టామన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ మాట్లాడుతూ కీర్తి చేకూరి సమర్థత సాధారణ ఎన్నికల్లో అందరికీ తెలిసిందన్నారు. విధుల్లో ఎంత ఒత్తిడిలు ఉన్నా నిబంధనలు తుచ తప్పకుండా పాటించేవారని, క్షేత్ర స్థాయి సిబ్బందికి అండగా నిలవడం ఆమె నైజం అని అన్నారు. గుంటూరు అర్బన్ ఎస్.పి. ఎస్.సతీష్ కుమార్ మాట్లాడుతూ కీర్తి తమకు బ్యాచ్ మేట్ అని, విధి నిర్వహణలో అందరినీ కలుపుకొని, తాను అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారన్నారు. గుంటూరు నగరాభివృద్ధిలో కీర్తికి ప్రత్యేక స్థానం ఉంటుందన్నారు. అనంతరం ప్రజా ప్రతినిధులు, అధికారులు పుష్పగుచ్చాలు అందించి అభినందించారు. తొలుత విభాగాధిపతులు, డిప్యూటీ కమిషనర్లు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు మాట్లాడారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పి.రోజా, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, ఇన్‌చార్జి కమిషనర్ శ్యాం సుందర్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్‌ఓ మధుసూదన్, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్ శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, వెంకట లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



కీర్తి చేకూరిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే నసీర్, కార్పొరేటర్లు, అధికారులు

ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసమే జనసేన ప్రయాణం

● గుంటూరు పశ్చిమ ఇన్‌ఛార్జ్ బోనబోయిన

గుంటూరు, జూలై 27: రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసమే జనసేన నిరంతరం కృషి చేస్తుందని జనసేన నేత, గుంటూరు పశ్చిమ ఇన్‌ఛార్జ్ బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. 28వ డివిజన్ జనసేన అధ్యక్షుడు మామిడి రామారావు ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డులోని సాయిబాబా ఆలయం ఎదుట జనసేన నాలుగో విడత క్రియాశీల సభ్యత్వ నమోదు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రాష్ట్రం కోసం అహర్నిశలు కృషి చేసే జనసేనలో సభ్యత్వం ద్వారా యువత పెద్ద ఎత్తున చేరాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, నగర కార్యదర్శి నారదాసు ప్రసాద్, దాసరి వెంకటేశ్వరరావు, భూషణం, శిఖావత్ బాబు, రాంబాబు, వెంకటేశ్వరరావు, జిడుగు రామ్మోహన్‌రావు తదితరులున్నారు.



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బోనబోయిన శ్రీనివాస్ తదితరులు

శాంతిభద్రతల సక్రమ నిర్వహణతోనే రాష్ట్రాభివృద్ధి

● ఐజీ త్రిపాఠి, జేసీ భార్గవతేజకు ఏపీ బీసీ సంక్షేమ సంఘం నేతల అభినందనలు

గుంటూరు, జూలై 27 : శాంతిభద్రతల సక్రమ నిర్వహణతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. ఇటీవల గుంటూరు రౌంజ్ ఐజీగా బాధ్యతలు చేపట్టిన సర్వశ్రేష్ఠ త్రిపాఠిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు. హింసాత్మక ఘటనలకు మూలమైన మత్తు పదార్థాల వినియోగం నుంచి యువతను రక్షించి, సన్మార్గంలో నడిపించేందుకు పోలీసుశాఖ కృషి చేయాలని కోరారు. అలానే జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన భార్గవతేజను కలెక్టరేట్‌లో కలిసిన కేసన శంకరరావు, ఇతర నాయకులు శాలువాలు, పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. బడుగు బలహీనవర్గాలకు సంబంధించిన భూవివాద పరిష్కారాలతో పాటు ఓబీసీలకు అవసరమైన సర్టిఫికెట్ల మంజూరులో ఉదారత ప్రదర్శించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అన్నవరపు నాగమల్లేశ్వరరావు, స్వాములు తదితరులున్నారు.


ఐజీ త్రిపాఠిని కలిసి శాలువాతో అభినందనలు తెలియజేస్తున్న కేసన శంకరరావు తదితరులు

హెపటైటిస్‌పై మెడికోలకు పోస్టర్ పోటీలు

గుంటూరు (మెడికల్) జూలై 27 : ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా శనివారం గుంటూరు వైద్యకళాశాల మైక్రో బయాలజీ విభాగం ఆధ్వర్యంలో ఎంబీబీఎస్ విద్యార్థులకు హెపటైటిస్ బీ అనే అంశంపై పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో వైద్య విద్యార్థులు ఇందులో ఉత్సాహంగా పాల్గొన్నారు. 2024 సంవత్సరం నేపథ్యంలో 'ఇట్స్ టైం ఫర్ యాక్షన్' అని మెడికోలు పోస్టర్ రూపంగా తెలియజేశారు. ఈ సందర్భంగా జీఎంసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టీటీకే రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకను వెలికి తీసేందుకు ఇటువంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్, మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ పరమేశ్వరి, డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ శివమ్మ, డాక్టర్ కాత్యాయని, డాక్టర్ లీనా, డాక్టర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి....

రక్తదానం చేసేందుకు ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాధితులను ఆదుకోవాలని ప్రభుత్వాస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డీఎస్‌ఎస్ శ్రీనివాస ప్రసాద్ కోరారు. శనివారం శిశు వైద్యవిభాగం సెమినార్ హాల్‌లో కారుణ్య సోషల్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరంలో ఆయన ప్రసంగించారు. పలువురు ఎన్‌సీసీ కేడెట్లు రక్తదానం చేశారు. కార్యక్రమంలో పీడియాట్రిక్ ప్రొఫెసర్ రమేష్, డాక్టర్ గురుప్రసాద్, రాయల్ కాప్స్ వ్యవస్థాపకులు బొల్ల దేవినాయుడు, రాజారమేష్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలతోనే మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

గుంటూరు(విద్య), జూలై 27: యువత జీవన నైపుణ్యాలు(లైఫ్‌స్కిల్స్)ను పెంపొందించుకోవాలని అప్పుడే ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చునని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ టి.శేఖర్ అన్నారు. నల్లపాడులోని కళాశాలలో శనివారం లైఫ్ యంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ప్రిన్సిపల్ టి.శేఖర్ మాట్లాడుతూ ప్రస్తుత సామాజిక పరిస్థితులు భయానకంగా ఉన్నాయని, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల అండ ఎంతో ముఖ్యమన్నారు. లైఫ్ స్కిల్ కోచ్ ఆచార్య రమణేశ్వర్ ప్రసంగిస్తూ సాంకేతిక విద్యతోపాటు విద్యార్థులు సమాంతరంగా జీవన నైపుణ్యాలు నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ సీఈవో ఎ.భానుప్రకాశ్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

చేనేత క్లస్టర్స్ ఏర్పాటుకు చర్యలు : కలెక్టర్


కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి చేనేత పరిశ్రమ దేశ వ్యాప్తంగా పేరు గాంచిందని, అక్కడ క్లస్టర్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో శనివారం ఆమె స్కిల్ డెవలప్‌మెంట్‌పై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చేనేత రంగానికి ఎలాంటి వృత్తి నైపుణ్యం కలిగిన వారు అవసరమో, వారికి ఎలాంటి శిక్షణ ఇవ్వాలో తెలుసుకోవాలని సూచించారు. ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్స్ ఏర్పాటు చేయాలని, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కింద యువతకు బేసిక్, అడ్వాన్స్ ట్రైనింగ్ అందించాలన్నారు. జిల్లాలోని స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులందరూ సీడాప్, డీఆర్డీఏ, మెప్మా అధికారులను సమన్వయం చేసుకొని నిరుద్యోగ యువతకు శిక్షణా, ఉపాధి కల్పించడంపై ప్లాన్ ఆఫ్ యాక్షన్ తయారు చేయాలని పేర్కొన్నారు.

సమావేశంలో తొలుత డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్ మాట్లాడుతూ జిల్లాలో 9 స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, నిర్మాణ రంగం, ఆటో మొబైల్, వ్యవసాయ, బ్యూటిఫియన్, హోటల్ మేనేజ్‌మెంట్, ఐటి రంగాల్లో యువతకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలోని స్వయం సహాయక సంఘాల ద్వారా కొన్ని యూనిట్లు ఇవ్వాలనుకుంటున్నామని, ప్రస్తుతం ఫిరంగిపురంలో రూ.40 లక్షలతో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్ విజయవంతంగా నిర్వహించబడుతున్నదన్నారు. జిల్లా ఉపాధి అధికారి రఘు మాట్లాడుతూ తమ కార్యాలయాన్ని మోడల్ కెరీర్ సెంటర్‌గా మార్చనున్నట్లు చెప్పారు. ఏ.బి.ఆర్.ఎస్.ఈ.టి.ఐ డైరెక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ ఏసి రిపేర్, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీలో శిక్షణ ఇస్తున్నామని, శిక్షణకు హాజరయ్యే దూరప్రాంత యువతకు ఉచిత వసతి సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ జిల్లాలోని పరిశ్రమలలో ఎన్ని ఖాళీలు వున్నాయో తెలియడం లేదన్నారు. యువత ఉద్యోగాల కోసం హైదరాబాదు వెళుతున్నారని, పరిశ్రమల శాఖను కూడా కమిటీలో చేరిస్తే పరిశ్రమల్లో ఖాళీలు తెలుస్తాయని, తద్వారా యువతకు జిల్లాలోనే ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ డీఆర్డీఏ హరిహరనాథ్ , పీడీ మెప్మా కె. వెంకటేశ్వర్లు , జిల్లా ఉపాధి అధికారి కే రఘు, డిఎస్‌డిఓ పి ప్రణయ్, డిప్యూటీ డైరెక్టర్ ఇండస్ట్రీస్ యం సుధాకర్, ఈడి బిసి కార్పొరేషన్ దుర్గాబాయి, స్టెప్ సిఈఓ కె వెంకటేశ్వర్లు, ఈడి ఎస్‌సీ కార్పొరేషన్ టి ప్రేమ కుమారి, అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్‌ఏసి వి నరసింహ రావు, ఏ.బి.ఆర్.ఎస్.ఈ.టి.ఐ డైరెక్టర్ రాజశేఖర్, డిస్ట్రిక్ట్ మేనేజర్ మహిళా ప్రాంగణం తరపున కృష్ణవేణి , డిస్ట్రిక్ట్ మేనేజర్ సీడాప్ బి శివరామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలాంకు ఘన నివాళి

గుంటూరు సిటీ, జూలై 27: దివంగత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జీవిత చరిత్ర అద్భుతమైనదని బీజేపీ సీనియర్ నేత జూపూడి రంగరాజు అన్నారు. భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో షేక్ సాంబశివరావు అధ్యక్షతన కలాం వర్థంతి కార్యక్రమం టిజెపిఎస్ కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా రంగరాజు మాట్లాడుతూ పేదరికం నుంచి పుట్టి కష్టపడి చదివి ప్రపంచం గర్వించదగ్గ శాస్త్రవేత్తగా, ఒక రాష్ట్రపతిగా ఉన్నత శిఖరాలను ఆయన అధిరోహించారని కొనియాడారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర మాట్లాడుతూ కలాం జీవితాన్ని ప్రతీ ఒక్క విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు అబ్దుల్ ఖుద్దూస్, షేక్ రఫీ, నరేంద్ర కుమార్ షా, షేక్ బిలాల్, షేక్ భాషా, హేమంత్ జైన్, కొక్కెర శ్రీనివాస్, తాడువాయి రామకృష్ణ, తిరుపతిరావు, ప్రొఫెసర్ మనోహర్ పాల్గొన్నారు.


అంబేద్కర్ భవన్‌లో కార్గిల్ యుద్ధం చిత్ర ప్రదర్శనలో కలాంకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

కార్గిల్ యుద్ధం చిత్ర ప్రదర్శనలో కలాం వర్ధంతి

గుంటూరు సిటీ, జూలై 27: సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) గుంటూరులో కార్గిల్ విజయ్ దివస్ సిల్వర్ జూబ్లీ ఫోటో ప్రదర్శనలో దివంగత రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని నిర్వహించారు. శనివారం ఫొటో ఎగ్జిబిషన్ రెండవ రోజున జేకేసీ కళాశాల, ఆంధ్రా క్రిస్టియన్ కళాశాల, విజ్ఞాన్ నిరుల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఫర్ ఉమెన్ విద్యార్థులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌ను సందర్శించి కార్గిల్ విజయ రజతోత్సవాలు, డాక్టర్ కలాం వర్ధంతి కార్యక్రమాలలో పాల్గొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి సీబీసీ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ఆర్.రమేశ్చంద్ర మాట్లాడుతూ డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం చిత్తశుద్ధి, పట్టుదలకు ప్రతీక అన్నారు. కలాం జీవితం, ఆయన అందించిన సేవలు భావితరాలకు, ముఖ్యంగా యువతకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

● నూతన జేసీని కలిసి విజ్ఞప్తి చేసిన అసోసియేషన్ నేతలు

గుంటూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సహకరించాలని రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దివి లీలామాధవరావు జాయింట్ కలెక్టర్ భార్గవ తేజకి విజ్ఞప్తి చేశారు. శనివారం కలెక్టరేట్‌లో డీలర్ల సంఘం నాయకులు జేసీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లీలామాధవరావు మాట్లాడుతూ పౌరసరఫరాల పంపిణీ వ్యవస్థలో రేషన్ డీలర్ల పాత్ర కీలకమన్నారు. సాధ్యమైనంత త్వరగా డీలర్ల ద్వారానే కార్డుదారులకు సరుకులు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎంఎల్‌ఎస్ పాయింట్లలో తూకం సరిగా వేసి డీలర్లకు సరుకులు పంపిణీ చేయాలన్నారు. జేసీ స్పందిస్తూ ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా డీలర్లు సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తుమ్మల గాంధీ, సెక్రెటరీ పిటిఎల్ వరప్రసాద్, టౌన్ సెక్రెటరీ జిలాని, వైస్ ప్రెసిడెంట్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.


జేసీకి అభినందనలు తెలియజేస్తున్న దివి లీలామాధవరావు తదితరులు

ఉచిత ఇసుకతో కార్మికులకు చేతి నిండా పని

గుంటూరు(తూర్పు),జూలై 27: ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన ఉచిత ఇసుక పాలసీతో భవన నిర్మాణ కార్మికులకు చేతినిండా పని దొరుకుతుందని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. గుంటూరు కొత్తపేట ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం జిల్లా సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుని కూడా పునరుద్ధరించాలని కోరారు. ఏఐటీ యూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఉద్యోగుల పక్షాన కాకుండా కార్పొరేట్, ప్రైవేట్ కంపెనీలకు అనుకూలంగా బడ్జెట్ కేటాయించారని విమర్శించారు. సెప్టెంబరు 1, 2, 3 తేదీలలో వైజాగ్‌లో జరిగే ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆకిటి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పుప్పాల సత్యనారాయణ, చల్లా చినఆంజనేయులు, కోట మాల్యాద్రి, బందెల రవికుమార్, చిన్ని సత్యనారాయణ, రావుల అంజిబాబు, మస్తాన్‌వలీ పాల్గొన్నారు.

ప్రైవేటు సిటీ బస్సులపై ప్రత్యేక తనిఖీలు

గుంటూరు(తూర్పు), జూలై 27 : నిబంధనలను ఉల్లంఘిస్తూ, నిర్లక్ష్యంగా నడుపుతున్నారనే ఫిర్యాదుల మేరకు శనివారం నగరంలో ప్రైవేటు సిటీ బస్సులపై డీటీసీ కరీం ఆధ్వర్యంలో రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. తనిఖీలలో భాగంగా కండక్టర్ లైసెన్సులు లేకుండా 4, ఇన్సూరెన్స్ లేని వాహనాలపై 1, మల్టీ హరన్ కలిగిన బస్సులు 7, ఇతర నిబంధనలు ఉల్లంఘించినందుకు 8 కేసులు మొత్తం 20 కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో ఆర్టీవో గోపాల్, మోటారు వాహన తనిఖీ అధికారులు రాఘవరావు, అనిల్, బాలకృష్ణ, సౌజన్య, మల్లీశ్వరీ, ఉషాకిరణ్, పవన్, మధుసూదన్‌రావు, అమృతరాణీ తదితరులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న రైల్వే సీఐ గంగా వెంకటేశ్వర్లు

ప్రయాణికులను బెదిరించి దోచుకుంటున్న వ్యక్తి అరెస్టు

రైల్వే స్టేషన్ ప్లాట్ ఫామ్‌పై ప్రయాణికులను బెదిరించి దోచుకుంటున్న పిడుగురాళ్ళకు చెందిన రామిశెట్టి శేషగిరి అనే నిందితుడిని గుంటూరు రైల్వే పోలీసులు అరెస్టు చేసారు. రైల్వేస్టేషన్‌లోని పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో రైల్వే సీఐ గంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శేషగిరి ప్లాట్ ఫారాలపై తిరుగుతూ గంజాయి, మద్యం మత్తులో నేరాలకు పాల్పడుతున్నాడన్నారు. గుంటూరు రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం నెంబర్-1 బుకింగ్ ఆఫీస్ వద్ద మార్కాపురం టౌన్‌కు చెందిన జల సూత్రం వెంకటేశ్వరరావు అనే ప్రయాణికుడిని వద్ద నుంచి సెల్‌ఫోన్, నగదు దౌర్జన్యంగా లాక్కొని, అతను ప్రతిఘటించడంతో చాక్ లాంటి వస్తువుతో బలమైన గాయాలు చేసి అక్కడి నుండి పారిపోయాడన్నారు. క్రైం పార్టీ వారు గస్తీ చేసి నేరస్తుడిని పట్టుకున్నారు. నిందితుడిని పట్టుకున్న ఎస్సై వేంకటాద్రి, సిబ్బందిని పోలీస్ అధికారులు అభినందించారు.

ప్రాణాలు కాపాడుకోవాలంటే హెల్మెట్ తప్పనిసరి

గుంటూరు, జూలై 27 : వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ డీఎస్పీ వీవీ నాయుడు స్పష్టం చేశారు. ఈ మేరకు అమరావతిరోడ్డులోని హిందూ ఇంజనీరింగ్ కళాశాలలో హెల్మెట్ వాడకంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ నాయుడు మాట్లాడుతూ హెల్మెట్ అనేది మన రక్షణ కవచం అనే విషయాన్ని ప్రతి వాహనచోదకుడు గుర్తుంచుకోవాలన్నారు. హెల్మెట్ వినియోగించని వారికి పెద్ద మొద్దంలో జరిమానాలు విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు ట్రాఫిక్ విభాగం ఇన్‌స్పెక్టర్ బి.కోటేశ్వరరావు, వెస్ట్ ట్రాఫిక్ డిపార్ట్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసరావు, కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి. ఐజాక్ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ సుబ్బారావు పాల్గొన్నారు.

మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి ఒక రోజు వేతనం వితరణ

గుంటూరు, జూలై 27 : గుంటూరు జిల్లా పోలీస్ డిపార్టుమెంట్‌లో హోంగార్డుగా పనిచేస్తూ ఇటీవల నల్లపాడు పరిధిలో రోడ్డు ప్రమాదంలో చనిపోయిన ఎస్.భాస్కర్‌కు (హెచ్‌జి 151)కు జిల్లాలోని హోంగార్డులు ఒక రోజు వేతనం రెండు లక్షల ముప్పై రెండు వేల ఎనిమిది వందల ఎనభై రూపాయలను వితరణగా ప్రకటించారు. ఆ మొత్తాన్ని చనిపోయిన హోంగార్డు భాస్కర్ కుటుంబ సభ్యులకు శనివారం జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు ఏఆర్ డీఎస్పీ శాంతి కుమార్, హోంగార్డ్ ఇంచార్జ్ ఆర్ఐ శ్రీనివాసరావు, హోంగార్డ్ ఆర్ఎస్ఐ రత్నరాజు, హోంగార్డ్ రైటర్ సుధీర్ ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి


సోమేశ్వరరావు(ఫైల్)

గుంటూరు, జూలై 27 : జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సోమేశ్వరరావు కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గవర్నమెంట్ హాస్పటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోమేశ్వరరావు మృతదేహానికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశించారు. మట్టి ఖర్చుల కింద రూ.25 వేలు మంజూరు చేయగా ఆ మొత్తాన్ని రిజర్వ్ ఆర్ఎస్ఐ వెంకటేశ్వరరావు, జిల్లా పోలీసు అసోసియేషన్ సభ్యులు కలసి సోమేశ్వరరావు సతీమణి మాధవికి అందించారు. అనంతరం ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ సిబ్బంది సోమేశ్వరరావుకు పోలీస్ లాంఛనాలతో మంగళగిరి ద్వారకా నగర్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్సై వెంకటేశ్వరరావుతో పాటు గుంటూరు జిల్లా పోలీస్ అసోసియేషన్ సభ్యులు జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ మైలా సాంబశివరావు, జాయింట్ సెక్రటరీ లక్ష్మణ్, సభ్యులు కరిముల్లా, హుస్సేన్ ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

ఒలింపిక్స్‌లో మరిన్ని పతకాలు సాధించాలి : నరసింహారెడ్డి

గుంటూరు(తూర్పు), జూలై 27: ఒలింపిక్స్‌లో దేశానికి మరిన్ని పతకాలు సాధించాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి ఆకాంక్షించారు. ప్యారిస్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం బీఆర్ స్టేడియం వద్ద ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారత క్రీడాకారులు అద్భుత ఫలితాలు సాధించి దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని అన్నారు. ఒలింపిక్స్ ప్రతి ఒక్కరిలో స్ఫూర్తి నింపుతుందని, దేశ క్రీడాకారులను ప్రోత్సహించాలని కోరారు. ర్యాలీలో క్రీడాకారులు, కోచ్‌లు, పలు స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రూ 3.50 లక్షల జనరేటర్ వితరణ

గుంటూరు(తూర్పు), జూలై 27: స్థానిక గోరంట్ల, టీచర్స్ కాలనీలో ఉన్న శ్రీ షిర్డిసాయి ఆధ్యాత్మిక, సేవ సమితి అనాధ, వృద్ధ ఆశ్రమానికి రూ.3.50 లక్షల విలువ కలిగిన జనరేటర్‌ను దాతలు ఆరుమళ్ల సుధాకరరెడ్డి, ఆరుమళ్ల నాగిరెడ్డి, విజయలక్ష్మి దంపతులు వితరణ చేశారు. కార్యక్రమంలో సేవ సమితి ఛైర్మన్ ఓరుగంటి విశ్వనాధం, సభ్యులు పుట్టా ఏడుకొండలు, వైకే శర్మ, కో ఆపరేటివ్ వైస్ ఛైర్మన్ కొండా భానురెడ్డి, మల్రెడ్డి బసివిరెడ్డి పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ఆవోపా ఆధ్వర్యంలో సత్కారం

గుంటూరు(విద్య), జూలై 27 : స్థానిక అరండల్‌పేటలోని ఆవోపా కార్యాలయంలో ఇంటర్, ఎంసెట్, నీట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ఆఫీషియల్స్ ప్రొఫెషనల్స్(అవోపా) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు తడవర్తి రాంబాబు, మట్టుపల్లి రవికుమార్, రాచపూడి సుబ్బారావు, అరుణ్‌కుమార్, నంబూరు శివనాగేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింత కృష్ణారావు, కెవి బ్రహ్మం, రాధాకృష్ణయ్య, మహంకాళి శ్రీనివాసరావు, మద్ది సాయి రమేష్ పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం మోపాలి

● ఎస్పీకి ఎమ్మెల్యే గళ్లా మాధవి వినతి


ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): నగరంలో యువత జీవితాలను నాశనం చేస్తున్న గంజాయిపై ఉక్కుపాదం మోపాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ఎస్పీ సతీశ్‌కుమార్‌ను కోరారు. నియోజకవర్గంలోని శాంతిభద్రతలపై శనివారం ఆమె జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. గంజాయి విషయంలో కఠినంగా వ్యవహరించాలని కోరారు. విచక్షణ మరిచి సామాన్య ప్రజలపై దాడులకు పాల్పడుతున్నారని, లేదంటే ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. 18వ డివిజన్ వడ్డెగూడెం, పార్కు ఏరియా, 20వ డివిజన్లోని కొబ్బరి తోట, నల్లచెరువు మూడోలైను, 25వ లైను, పార్వతీపురం వెనకప్రాంతం, సంపత్‌నగర్ మున్సిపల్ పార్కు, పీకలవాగు నుంచి శ్మశానవాటికరోడ్డు, నంబూరు సుభాని కాలనీ, 21వ డివిజన్లోని మణి హోటల్ సెంటర్, 22వ డివిజన్లో రాఘవయ్య పార్కు, వాటర్ ట్యాంకు ప్రాంతాలు, 23వ డివిజన్లో శాంతినగర్ 4, 5 లైన్లు, ఆకులవారితోట 3వ లైను, 25వ డివిజన్ అంతటా గంజాయి విచ్చలవిడిగా దొరుకుతుందని అన్నారు. 29వ డివిజన్ నుంచి 40వ డివిజన్ వరకూ ప్రతి ప్రాంతంలో గంజాయి దొరుకుతోందని దానిపై చర్యలు తీసుకోవాలని ఆమె ఎస్పీని కోరారు.

అభివృద్ధిని మరిచిన వైసీపీ పాలకులు

నియోజకవర్గంలో వైసీపీ నేతలు యథేచ్ఛగా దోపిడీకి పాల్పడి, అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని గళ్లా మాధవి విమర్శించారు. 35వ డివిజన్‌లోని కృష్ణనగర్‌లో రూ.15 లక్షల అంచనాతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జోన్-5 ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర, కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, వనమా నరేంద్ర, కొల్లి అనిల్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రపంచం గర్వించదగ్గ మేధావి అబ్దుల్ కలాం

ప్రపంచం గర్వించదగ్గ మేధావి ఏపీజే అబ్దుల్ కలాం అని గళ్లా మాధవి కొనియాడారు. కలాం వర్ధంతి సందర్భంగా పట్టాభిపురం మెయిన్‌రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఆమె నివాళులర్పించారు. కలాం జీవితంపై రూపొందించిన కరపత్రాలను ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో మానం శ్రీనివాస్, వరప్రసాద్, రుస్తుంబాబు, సింగంశెట్టి వీరయ్య, కొల్లి అనిల్, నసీర్, అప్పారావు, శంకర్, మన్నవ మోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎల్‌వీఆర్ క్లబ్ సభ్యులకు ఉచిత మెగా మెడికల్ శిబిరం

గుంటూరు(తూర్పు), జూలై 27: వికాస్ హాస్పిటల్స్ గుంటూరు వారి ఆధ్వర్యంలో ఎల్‌వీఆర్ అండ్ సన్స్ క్లబ్ రీడింగ్ రూం సౌజన్యంతో ఆదివారం ఉదయం స్థానిక ఎల్‌వీఆర్ క్లబ్ ఆవరణలో క్లబ్ సభ్యులకు మెగా మెడికల్ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు వికాస్ హాస్పిటల్స్ సీఈవో సాతులూరి నరసింహమూర్తి, క్లబ్ గౌరవ అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పలు విభాగాలకు చెందిన వైద్యులు పాల్గొని పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈసీజీ, 2డీ ఎకో, బీఎమ్‌డీ వంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు జరిగే శిబిరాన్ని క్లబ్ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సూర్యనారాయణతోనే ఉద్యోగుల హక్కుల పరిరక్షణ

● ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సయ్యద్‌చాంద్ బాషా

గుంటూరు(తూర్పు), జూలై 27 : ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణతోనే ఉద్యోగుల హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుందని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు సయ్యద్‌చాంద్ బాషా అన్నారు. మెడికల్ కళాశాల ఆవరణలోని సంఘ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నుంచి బహిష్కరణ కాబడిన వారు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులని శ్రీకాంత్‌రాజు, ఆస్కారరావు చెప్పుకోవటం హాస్యాస్పద మన్నారు. వీరిని బహిష్కరణ చేస్తూ సంఘ 78 సభ్యుల తీర్మానం కూడా చేయడం జరిగిందని, దీనికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు మద్దతు పలికి తొలగిస్తూ తీర్మానం చేసి సంతకాలు పెట్టడం కూడా జరిగిందని గుర్తుచేశారు. కెఆర్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పనిచేస్తుందని అయన స్పష్టం చేశారు. సమావేశంలో కెవిఎస్ శివారెడ్డి, కరీముల్లా షాఖాదరి, పెదరత్తయ్య, రాధాకృష్ణ, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ వై నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'ఫిల్, స్పిన్, విన్' హెచ్‌పీసీఎల్ కొత్త నినాదం

గుంటూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ వినియోగదారులలో చైతన్యం కోసం ఫిల్, స్పిన్, విన్ అనే కొత్త ప్రచారాన్ని ప్రారంభించింది. తన రిటైల్ అవుట్‌లెట్ నెట్‌వర్క్‌లో కస్టమర్ సర్వీస్‌లో అత్యుత్తమ సేవలను అందించడానికి శనివారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. సంస్థ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గుంటూరులోని శ్రీ పద్మావతి ఫిల్లింగ్ స్టేషన్‌లో ఈ కార్యక్రమం ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ జోన్ చీఫ్ జనరల్ మేనేజర్ బెన్నీ సి థామస్, చీఫ్ రీజినల్ మేనేజర్ ఆదిత్య ఆనంద్, విజయవాడ రిటైల్ రీజియన్ పరిధిలోని ఆఫీసర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు తన మునుపటి ప్రచారం సమ్మర్ కూల్ క్యాంపెయిన్ విజయవంతమైన క్షణాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా కస్టమర్‌కు సమ్మర్ కూల్ క్యాంపెయిన్ సమయంలో ప్రకటించిన మెగా ప్రైజ్‌గా ఆరు హీరో గ్రాఫ్ బైక్‌లు, బంపర్ బహుమతులుగా ఆరు మొబైల్స్, ఆరు ల్యాప్‌టాప్‌లు విజేతలకు అందించారు.


ఎస్‌కేబీపీఎంలో మొక్కలు నాటిన విద్యార్థులు

గుంటూరు(విద్య), జూలై 27 : స్థానిక ఎన్జీవో కాలనీ సమీపంలోని శ్రీ కోనబాల ప్రభాకరరావు మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో (ఎస్‌కేబీపీఎంసీహెచ్ఎస్) స్కూల్‌లో శనివారం ఐటీసీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా జరుగుతున్న శిక్షా సప్తాహంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించినట్లు హెచ్‌ఎం శివకుమారి అన్నారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు జె.విజయానంద్, పీఈటీ మాధవి, ఐటీసీ ఫినిస్ సొసైటీ మేనేజర్ కె.నారాయణ, శైలజ, యశ్వంత్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి ప్రదర్శన

గుంటూరు(తూర్పు), జూలై 27 : స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అన్నమయ్య కళావేదికపై నాగార్జున కల్చర్ సెంటర్, నాగార్జున మ్యూజిక్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో మహంకాళి సూర్యనారాయణ శర్మ శిష్య బృందంచే శనివారం కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. మహంకాళి నాగలక్ష్మి ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన నృత్య రూపకాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నాగార్జున కల్చర్ సెంటర్ కార్యదర్శి పిఎస్ఎన్ మూర్తి, నాగార్జున స్కూల్ ఆఫ్ మ్యూజిక్ అండ్ కల్చర్ సెంటర్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ కే.సూర్యనారాయణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.


studio green
STUDIO GREEN FILMS (P) LTD.
K.E.GNANAVELRAJA & AADHANA GNANAVELRAJA
ALLU SIRISH'S
బడ్డీ
WRITTEN & DIRECTED BY
SAM ANTON
CO-PRODUCED BY NEHA GNANAVELRAJA
PRODUCED BY
KE GNANAVELRAJA
AADHANA GNANAVELRAJA
IN CINEMAS
AUGUST 2ND
Junglee


కనిపించేదంతా మున్నేత్రుడి మర్మమే
1ST AUG
IN THEATRES
శివం భజే
MAHESWARA REDDY MOOLI APSAR


VIJAYA BHASKAR KRAFT
ఆగస్టు
2
బ్రహ్మాండమైన
విడుదల
A VIJAYA BHASKAR FILM
SREE KAMAL TANVI AKAANKSHA
ఉషాపరిణయం
Love is Beautiful..!
WRITTEN, PRODUCED & DIRECTED BY
VIJAYA BHASKAR K
DOP SATISH MUTYALA MUSIC RR DHRUVAN
Pre Release Event
ON SUNDAY
28.7.2024


INFINITI
IN THEATRES
AUGUST 2ND
VIJAY ANTONY
తుఫాన్
S.D.VIJAY MILTON
SCRIPT | DOP | DIRECTION SD VIJAY MILTON
KAMAL BOHRA | D. LALITHAA | B PRADEEP | PANKAJ BOHRA
ANDHRA PRADESH & NIZAM THEATRICAL RIGHTS CONTROLLED BY: PADMAKAR CINEMAS


DHANUSH
MASSIVE
BLOCKBUSTER
KALANITHI MARAN
PRESENTS
DHANUSH
రాయన్
WRITTEN AND DIRECTED BY DHANUSH
AN A R RAHMAN MUSICAL


SVC RELEASE
అలనాటి
రామచంద్రుడు
IN CINEMAS
AUG 2nd


TRISHA
AUGUST
2ND
IN THEATERS
తిరగబడరసామి...
MALKAPURAM SHIVAKUMAR
A S RAVIKUMAR CHOWDARY

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తదితరులు

రక్తదానాన్ని ప్రోత్సహించాలి

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరుటౌన్, జూలై 27 : రక్తదానం మరోకరికి ప్రాణదానంతో సమానమని, రక్తదాన కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని తెలగపాలెంలో జనసేన ఉపాధ్యక్షుడు మల్లిబోయిన గోపి తన కుమార్తె జన్మదినం సందర్భంగా వైజేయూత్ ఆధ్వర్యంలో, మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరాన్ని ప్రారంభించిన నరేంద్ర కుమార్ మాట్లాడుతూ సమాజానికి ఉపయోగ పడే పనులు చేయాలని యువతకు సూచించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, పొన్నూరు ఇన్‌చార్జి వడ్రాణం మార్కెండేయ బాబు, బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమలశెట్టి ఉమాశంకర్, జనసేన నాయకులు షేక్ కరిముల్లా, నాగిశెట్టి సుబ్బారావు, దేశంశెట్టి సూర్య తదితరులతో పాటు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ రాజకీయ సన్యాసం తీసుకో..

● అప్పుడే రాష్ట్రం బాగుపడుతుంది : టీడీపీ సీనియర్ నేత వీరవల్లి మురళి

తెనాలి రూరల్, జూలై 27: ఐదేళ్ల వైసీపీ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో హత్యలు, దాడులు, అక్రమాలతో రాష్ట్రాన్ని కొల్లగొట్టారని అటువంటి వ్యక్తి శాశ్వతంగా రాజకీయాలకు దూరంగా ఉంటూ సన్యాసం తీసుకుంటే రాష్ట్రం బాగుపడుతుందని గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నాయకులు వీరవల్లి మురళి అన్నారు. అసెంబ్లీపై అలిగిన జగన్‌మోహన్‌రెడ్డి విధానాన్ని ఖండిస్తూ శనివారం మండలంలోని అంగలకుదురులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలే ఇవ్వని ప్రతిపక్షహోదాను జగన్ కావాలనడం సబబు కాదన్నారు. అధికారంలో ఉండగా ఏనాడు రాష్ట్ర ప్రయోజనాలపై దృష్టిపెట్టని జగన్‌మోహన్‌రెడ్డి అధికారం కోల్పోయిన తర్వాత ప్రతిపక్ష పాత్ర ఏ విధంగా పోషిస్తాడో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. అధికారంలో ఉండగా ఏ నాడు మీడియాను దగ్గరకు రానివ్వని జగన్ ఇప్పుడు మాత్రం అసెంబ్లీ జరిగిన ప్రతిసారి మీడియా ముందు మాట్లాడుతాననడం అతని ద్వంద్వ వైఖరికి నదర్శనమని ఆక్షేపించారు రాష్ట్రానికి జవాబుదారితనంగా ఉండే కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అభివృద్ధి దశగా అడుగులు వేస్తుందన్నారు. ఇప్పటికే ఇసుక ఉచిత విధానం అమలు కాగా, నిత్యవసరాలను కూడా సబ్సిడీపై అందిస్తూ పేదల ప్రభుత్వం కూటమి ప్రభుత్వ పాలన జరుగుతుందన్నారు. ఇప్పటికైనా జగన్‌రెడ్డి ఆత్మపరిశీలన చేసుకుని శాశ్వతంగా రాజకీయాలకు దూరంగా ఉండాలని మురళి హితవు పలికారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శేషన్న

పారిశుధ్య పనులలో అలసత్వం వద్దు

● మున్సిపల్ కమిషనర్ శేషన్న ● పట్టణంలో పనుల పరిశీలన

తెనాలి, మారీసుపేట జూలై 27: పట్టణంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనుల నిర్వహణలో అసత్వం వద్దని మున్సిపల్ కమిషనర్ బీ.శేషన్న శానిటేషన్ సిబ్బందిని హెచ్చరించారు. స్థానిక 31వ వార్డులో శనివారం పారిశుధ్య పనులను ఆయన పరిశీలించి, అధికారులకు, పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు చెత్తను డ్రెయిన్‌లలో వేయరాదని, పారిశుధ్య కార్మికులకు అందించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, తద్వారా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చాన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతను పాటించాలని కోరారు. అనంతరం చినరావూరు 14వ వార్డులో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచలను చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి

● నష్ట పరిహారం చెల్లించాలని బాధితులు డిమాండ్

పెదకాకాని, జులై 27 : విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి చెందిన ఘటన పెదకాకాని మండల పరిధిలోని నంబూరు రైల్వేస్టేషన్ సమీపంలో గల పెంతుకోస్తు చర్చి వెనుక శనివారం జరిగింది. మండల పరిధిలోని కొప్పురావూరు గ్రామానికి చెందిన శాఖమూరి సాంబయ్య, శ్రీనులు ప్రతిరోజులాగే గ్రామశివారులోని ప్రాంతాల్లో గేదలను మేతకోసం తోలుకొని వెళ్లారు. అదే ప్రాంతంలో కరెంట్ తీగలు తెగి పడి ఉండగా, ఆ విషయాన్ని స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు, ఇబ్బందికి తెలియపరిచారు. అయినా వారు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. కనీసం ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా కూడా నిలిపివేయలేదు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మేతకు వచ్చిన మూడు పశువులు తెగిపడిన విద్యుత్ వైర్లు తగిలి మృతి చెందాయి. కళ్ళు ఎదుట విద్యుత్‌షాక్‌కు గురై జీవనాధారమైన పశువులు మృతి చెందటంతో వాటి యజమాలను తీవ్ర వేదనకు గురయ్యారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే తమ గేదెలు మృతి చెందాయని, తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని పశువు యజమానులు డిమాండ్ చేశారు.



పొన్నూరులో శెట్టి లింగేశ్వరరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

ఈతకు దిగి మిర్చియార్డు ఉద్యోగి మృత్యువాత

● సాగర్ కుడికాలువలో మృతదేహం లభ్యం.. మృతుడు పొన్నూరు వాసి

● కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల

మాచర్లరూరల్, జూలై 27: కుడి కాలువలో ఈతకు దిగి ప్రమాదవశాత్తూ వ్యక్తి మృతి చెందిన వక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణంలోని 30వవార్డుకు చెందిన శెట్టిగోపి(32) గుంటూరు మిర్చియార్డులో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. శుక్రవారం తన స్నేహితులతో కలిసి కారులో నాగార్జునసాగర్ విహారయాత్రకు వచ్చారు. సాగర్, ఎత్తిపోతల తదితర ప్రాంతాలను సందర్శించి సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలోని తాళ్లపల్లి బ్రిడ్జి వద్ద కారును నిలిపి గోపి ఈత కొట్టేందుకు కుడి కాలువలో దిగాడు. నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడంతో కాలువలో గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న విజయపురిసౌత్ ఎస్ఐ పట్టాభిరామయ్య తన సిబ్బందితో కలిసి కుడి కాలువలో గాలింపు చేపట్టారు. శనివారం గోపి మృతదేహం తాళ్లపల్లి వద్ద కుడికాలువలో లభ్యమైంది. మృతదేహాన్ని మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పట్టాభిరామయ్య తెలిపారు.

శెట్టిలింగాలకు ఎమ్మెల్యే పరామర్శ

పొన్నూరుటౌన్ : టీడీపీ సీనియర్ నేత శెట్టి లింగేశ్వరరావు మనుమడు శెట్టి గోపి శుక్రవారం నాగార్జున సాగర్ కుడి కాల్వలో ప్రమాదవశాత్తు జారీ పడి గల్లంతై మృతి చెందగా శెట్టి లింగేశ్వరరావుని శనివారం ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, పట్టణ టీడీపీ నేతలు కలిసి పరామర్శించారు. అలాగే టీడీపీ సీనియర్ నేత మాదాల వెంటకటేశ్వరరావు, ఆకుల సాంబశివరావు, బండ్లమూడి బాబురావు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, పట్టణ ప్రముఖులు లింగేశ్వరరావును పరామర్శించారు.

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు ఘన నివాళి



కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి

తెనాలిరూరల్, జూలై27: మాజీ రాష్ట్రపతి, ప్రముఖ అణుశాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్‌కలాం వర్ధంతిని తెనాలి పట్టణ, పరిసర ప్రాంతాల్లో నిర్వహించారు. తెనాలి కొత్తపేటలోని టీడీపీ కార్యాలయంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పార్టీ శ్రేణులతో కలిసి ఏపీజీ అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను మననం చేసుకున్నారు. పట్టణ,మండల పార్టీ అధ్యక్షులు తాడిబోయిన హరిప్రసాద్, కేసన కోటేశ్వరరావు, మహమ్మద్ ఖుద్దుస్, జొన్నాదుల మహేష్, ఈదర వెంకటపూర్ణచంద్, పలువురు కౌన్సిలర్లు, మైనార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని కాలేషా - మీరావలి, గంగానమ్మ మిత్రమండలి, అబ్దుల్ కలాం సేవాసమితి, గ్యార్మి జెండా కమిటీల ఆధ్వర్యంలో ఏపీజీ కలాం వర్ధంతి నిర్వహించారు. కుమార్‌గ్రూఫ్‌ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత కొత్తసుబ్రహ్మణ్యం, ఆంధ్రప్రదేశ్‌బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, జనసేన నాయకులు తోటకూర వెంకటరమణారావు, మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ కాలేదానసీమ, రియాజ్‌ఖాన్ దంపతులు, మాజీ కౌన్సిలర్ పెండ్యాల సుబ్బారావు, టీడీపీ వాణిజ్యవిభాగ అధికార ప్రతినిధి ఈదర వెంకటపూర్ణచంద్, 15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ షేక్ జాకీర్ హుస్సేన్, రెడ్‌క్రాస్ సొసైటీ తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి, బూరెల దుర్గాప్రసాద్, అక్కిదాసుకిరణ్‌కుమార్, దాసరి శ్రీనివాసరరావుర అడపా సంపత్‌రాయుడు, పలువురు ప్రముఖులు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు.

తెనాలి అర్బన్: ప్రముఖ శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి, అబ్దుల్ కలాం వర్ధంతి శనివారం పట్టణంలో పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మార్కెట్ సెంటర్‌లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అబ్దుల్‌కలాం శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి అందించిన సేవలు నిరుపమానమని పలువురు వక్తలు కొనియాడారు. మేడిబోయిన గంగాయాదవ్, బీష్మా పాములు, గంగాదేవి, శివశంకర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు అడపా సంపత్‌రాయుడు,అనంతాచార్యులు, సాయిగుప్తా, కనకదుర్గ, వేణు, హనుమంతరావు కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. పాల్గొన్నారు.

పొన్నూరుటౌన్: భారత దేశాన్ని శాస్త్ర సాంకేతిక రంగాల్లో అగ్రపధాన నిలిపిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ యువతకు ఆదర్శప్రాయుడని టీడీపీ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్ ఖాన్ అన్నారు. టీడీపీ కార్యాలయంలో కలామ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో బండ్లమూడి బాబురావు, పఠాన్ అహ్మద్ ఖాన్, షేక్ బాజి సాహెబ్, కరిముల్లా బాజీ, తమనం రవి, మధు పాల్గొన్నారు.

జనసేన పార్టీ కార్యాలయంలో కలామ్ చిత్రపట్టానికి జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గోవాడ వెంకట కృష్ణారావు, జీ బాలు, జనసేన పట్టణ, మండల అధ్యక్షుడు షేక్ కరిముల్లా, నాగిశెట్టి సుబ్బారావు, వల్లంశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.



పొన్నూరులో అబ్దుల్ కలామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

పశువైద్యాధికారిపై విచారణ చేపట్టాలి

● సెమన్ నగదు వసూళ్లలో అవకతవకలకు పాల్పడ్డారు

● ప్రశ్నించిన వారిపై వ్యక్తిగతంగా పగ తీర్చుకున్నారు

● తీవ్ర ఆరోపణలు చేస్తున్న పశుపోషకులు, గోపాల మిత్రలు

చేబ్రోలు, జూలై 27 : వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి ఓ పశు వైద్యాధికారి సాగించిన అవినీతి అక్రమాలు, వేధింపుల పర్వంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గోపాలమిత్రులతో పాటు పశు పోషకులు ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు. చేబ్రోలు మండలంలో ఓ పశు వైద్యాధికారిపై కొంత కాలగా తీవ్ర ఆరోపణలు వెల్లువెతున్నాయి.

సుదీర్ఘకాలంగా ఒకే ప్రాంతంలో పాతుకుపోయిన ఈ వైద్యాధికారి చేసిన ఆగడాలకు అంతుపోంతు లేకుండా పోయాయని వారు ఆరోపిస్తున్నారు. 30 ఏళ్లుగా పనిచేస్తున్న గోపాల మిత్రులపై ఆయన ఆగడాలు మితిమీరటంతో గోపాల మిత్రులు ప్రశ్నించారు. దీంతో నిబంధనలకు విరుద్ధంగా ఆ గోపాల మిత్రులను విధుల నుంచి తొలగకించి వేరోకరిని నియమించారని ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో వైసీపీ నేతల అండ చూసుకుని కులపరంగాను వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. 14 ఏళ్లుగా తిష్ట వేసిన ఈ అధికారి బెదిరింపులకు తాళలేక ఇబ్బందులు పడిన సిబ్బంది బాధలు వర్ణనాతీతం. ఈ వైద్యాధికారి ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండానే విదేశాలకు వెళ్లి తిరిగి వచ్చారు. ప్రభుత్వంలోని ఓ ఉన్నత స్థాయి అధికారి అండదండలతో చెలరేగిపోయారని ఆ సందర్భంలో పలువురు ఆరోపించారు. 2019 నుంచి జాతీయ కృత్రిమ గర్భదారణ పథకం క్రింద అన్ని రాష్ట్రాల్లో ఉచితంగా పాడి పశువులకు కృత్రిమ గర్భదారణ చేస్తున్నారు. ఎక్కడ లేని విధంగా ఒక గుంటూరు జిల్లాలోనే ఈ అధికారి రైతుల నుంచి సెమన్ రూపంలో నిబంధనలకు విరుద్ధంగా వసూళ్ల చేసారు. ఈ కృత్రిమ గర్భదారణ పథకానికి 2 కోట్ల రూపాయల ప్రోత్సహకాలను అందించనట్లు లెక్కల్లో చూపారు. అలాగే జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ నుండి గత పదేళ్లుగా ద్రవ నత్రజనిని తన ఇష్టారాజ్యంగా ప్రైవేటు సంస్థలకు అమ్మి సోమ్ము చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నిధులను చెల్లించకపోవటంతో విచారణ జరగటంతో కొద్దికాలం క్రితం రూ. 10 లక్షల వరకు చెల్లించినట్లు సమాచారం. కరోనా సమయంలోనూ కృత్రిమ గర్భదారణ క్రింద వసూళ్ల చేసిన రుసుములు సొంతానికి వినియోగించుకునట్లు సిబ్బంది పలువురు ఆరోపించారు. అలాగే సంస్థ నిధులను స్వంతానికి దుర్వినియోగం చేశారని ఆరోపించారు. క్రింద స్థాయి సిబ్బందిని స్వంత ఇంటి నిర్మాణ అవసరాలకు వినియోగించుకున్నారు. ఇందుకు విరుద్ధంగా వ్యవహరించిన క్రింద స్థాయి సిబ్బందిపై వేధింపులకు సైతం పాల్పడ్డారని బాధితులు గతంలోనే వాపోయారు. తనకు నచ్చని గోపాల మిత్రులు సిబ్బందిని వేధించటమే పనిగా పెట్టుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ద్రవ నత్రజని కంటైనర్లు మార్చటానికి ఒక్కొక్కరి నుంచి రూ.5 వేల వరకు ముడుపుల రూపంలో వసూళ్ల సమాచారం. ఈ అధికారి సాగిస్తున్న అరాచకాలు, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.



శ్రీనివాసరావుకి ఎన్నిక పత్రాన్ని అందజేస్తున్న సంఘు సభ్యులు

ఆర్యవైశ్య సంఘం

జిల్లా కార్యదర్శిగా కారుమూరి

తెనాలి, మారీసుపేట జూలై 27: గుంటూరు జిల్లా ఆర్యవైశ్య సంఘ జిల్లా కార్యదర్శిగా కారుమూరి శ్రీనివాస్‌ను జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు పెడేల సుబ్బారావు నియమించారు. స్థానిక గంగనమ్మపేటలోని ఆర్యవైశ్య విద్యానిధి ప్రాంగణంలో శనివారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో గుంటూరు జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యదర్శిగా సంఘ సభ్యులు కారుమూరి శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘ అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు.



గంబూషియా చేపలను వదులుతున్న జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ

దోమల నివారణకు చర్యలు

తెనాలి, మారీసుపేట జూలై 27: పట్టణంలో దోమల నివారణకు లార్వా దశలోనే అరికట్టేందుకు చర్యలను మలేరియా అధికారులు చేపట్టారు. శనివారం స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని హడ్కోకాలనీలోని నీటి కుంటల్లో జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం తదితరులు గంబూషియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ గంబూషియా చేపలు దోమల లార్వాలను తింటాయని, తద్వారా దోమల సంతతి వృద్ధి చెందకుండా ఉంటుందన్నారు. ప్రజలు పరిశరాలను శుభ్రంగా ఉంచాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో మలేరియా, ఫైలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

మెప్మాలో బోగస్ గ్రూపులపై కేసు

పొన్నూరుటౌన్, జూలై 27: పొన్నూరు మెప్మా విభాగంలో బోగస్ గ్రూపుల నమోదు విషయంలో జరిగిన అవకతవకలపై అర్బన్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పట్టణంలోని 8వ వార్డులో మెప్మా విభాగంలో పనిచేసే రిసోర్స్ పర్సన్ నిమ్మకాయల నాగసంధ్య ఫిర్యాదు మేరకు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కెనరా బ్యాంక్‌లో ఓ గ్రూపుకు సంబంధించిన వివరాలను సిటీ మిషన్ మేనేజర్ మానుకొండ మేరి జోస్నా, మరో ఆర్పీ పరాన్ రిజ్వానాలు చెరిపి వేసారని, ఈ ఆధారాలు బోగస్ పొదుపు సంఘానికి సంబంధించినవని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. మెప్మాలో జరిగిన అవకతవకలపై ప్రాజెక్ట్ మేనేజర్ ఆధ్వర్యంలో విచారణ జరుగుతునందున్న, ఆధారాలు బయటకు వచ్చి నిజాలు బయటపడతాయనే ఉద్దేశంతో రికార్డులు మార్చే ప్రయత్నం జరిగిందని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

స్థలం విషయంలో ఘర్షణ.. వ్యక్తికి గాయాలు

తెనాలి రూరల్, జూలై 27: మూడు సెంట్లు స్థలం విషయంలో వచ్చిన విభేదాల కారణంగా జరిగిన దాడిలో వ్యక్తికి గాయాలయ్యాయి. మండలంలోని పెదరావూరు గ్రామానికి చెందిన బారీసైదా తన బంధువులైన బాగూర్‌మీరా, రసీద్, ఇబ్రహింలకు అమ్మమ్మ ఆస్తి విషయంలో విభేదాలు ఉన్నాయి. దీనిపై కోర్టులో కేసు నడుస్తుంది. ఈక్రమంలో అమ్మమ్మ బాజీ అనారోగ్యంతో మృతి చెందటంతో ఆస్తిపై వాదోపవాదాలు జరుగుతుండగా బారీసైదా తన బంధువులైన నాగుల్‌మీరా, రసీద్, ఇబ్రహింలపై దాడిచేశాడు. ఈదాడిలో నాగుల్‌మీరా తలకు గాయంకాగ మిగిలిన రసీద్, ఇబ్రహింలకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితులు తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో చికిత్స పొందుతున్నారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

మొక్కల సంరక్షణతో పర్యావరణ పరిరక్షణ

చేబ్రోలు, పొన్నూరుటౌన్, జూలై27: మొక్కలు నాటి వాటిని సంరక్షించటంతో పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని విద్యాశాఖ ఆర్జేడీ బీ. లింగేశ్వర్ రెడ్డి అన్నారు. చేబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం 'శిక్ష సప్తాహ్' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మొక్కల నాటారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులతో సమావేశమై వారి విద్యాప్రమాణాలను పరిశీలించారు.

అలాగే పొన్నూరు మండలం చింతలపూడి జిల్లా పరిషత్ హైస్కూల్లోనూ శిక్ష సత్తాహ్ కార్యక్రమం నిర్వహించారు. ఫార్మేషన్ ఆఫ్ ఎకో క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులు మొక్కల పెంపకం ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వైఎస్‌టి సాయి, ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి, స్కౌట్స్ అండ్ గైడ్స్ టీచర్ జె ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం నీడన నిడుబ్రోలు వంతెన

● పలు ప్రాంతాలో వంతెనపై భారీగా పెరుగుతున్న చెట్లు

● ఏళ్ల తరబడి కన్నెతి చూడని అధికారులు

పొన్నూరుటౌన్, జూలై27: పొన్నూరు, నిడుబ్రోలు ప్రాంతాలను కలుపుతూ నిర్మించిన వంతెన రోడ్లు, భవనాల శాఖ నిర్లక్ష్యానికి గురవుతుంది. అర కిలోమీటర్ పొడవున నిర్మితమైన ఈ వంతెన నిర్వహణను అధికారులు గాలికి వదిలేవారు. ఫలితంగానే వంతెన పక్క గోడలపై రావి, మర్రి, వేప చెట్లు మొలిచి భారీగా పెరుగుతున్నాయి. దీంతో వంతెన ప్రమాదకరంగా మారింది. చెట్లు మొలిచిన ప్రాంతాల్లో పగుళ్ల ఏర్పడి కాంక్రీట్ గోడలు శిథిలమవుతున్నాయి. దీంతో ఆ వంతెనపై రాకపోకలు సాగించాలంటే పెను ప్రమాదకరంగా ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొన్నూరు ప్రాంత వాసులే కాకుండా పొన్నూరు నుంచి రేపల్లె, చెరుకుపల్లి ప్రాంతాలకు వెళ్లే వారు ఈ వంతెన మీదుగా వెళ్లాల్సిందే. రోడ్లు, భవనాల శాఖ అధికారులు తక్షణమే స్పందించి వంతెనపై పెరుగుతున్న చెట్లను శాశ్వతంగా తొలగించి, గోడలకు మరమ్మతులు నిర్వహించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



నిడుబ్రోలు వంతెనపై పెరుగుతున్న చెట్లు



సమావేశంలో మాట్లాడుతన్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

టీడీపీ లీగల్ సెల్ సేవలు అభినందనీయం

● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, జూలై 27: 'ఐదేళ్ల వైసీపీ పాలనలో టీడీపీ నాయకులు, కార్యకర్తలే టార్గెట్‌గా వారిపై అక్రమ కేసులు పెట్టారు. ఆ సమయంలో పార్టీ లీగల్ సెల్ బాధితులకు అండగా ఉంటూ వారిపై పెట్టిన కేసులను తిప్పికొట్టడంలో కీలకంగా వ్యవహరించింది. ఇలా టీడీపీ లీగల్ సెల్ అందించిన సేవలు అభినందనీయమైనవి' అని టీడీపీ తెనాలి నియోజవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో లీగల్‌సెల్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొని పార్టీ విజయానికి వారు చేసిన సేవలను కొనియాడారు. రాబోయే రోజుల్లోనూ లీగల్ సెల్ మరింత బలోపేతం కావాలని అందుకు అందరూ సమన్వయంగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం లీగల్ సెల్ ప్రతినిధులు కూటమి విజయానికి నియోజకవర్గంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ చేసిన సేవలకు గాను దుశ్శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమలో అధ్యక్షుడు ఎం. మల్లికార్జున రావు, సీనియర్ న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరరావు, గట్టిపాటి రాంబాబు, అనిత, లలిత, వీరాంజనేయులు, అప్పల కిషోర్, ప్రదీప్, రాజారామ్ పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉప్పలపాడులో దొంగల బెడద

● మొన్న లారీ బ్యాటరీలు.. నేడు బైకుల చోరీకి యత్నం

● బెంబేలెత్తుతున్న స్థానిక ప్రజలు

పెదకాకాని, జూలై 27 : మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామంలో వరుస చోరీలతో దొంగలు దడపుట్టిస్తున్నారు. కొద్ది రోజులుగా ఉప్పలపాడులోని అనేక ప్రాంతాలను టార్గెట్‌చేసి దొంగలు దోపిడీలకు పాల్పడుతున్నారు. దీంతో గ్రామస్థులు బెంబేలెత్తిపోతున్నారు.. గత నాలుగు రోజుల్లో వరుసగా చోరీకి జరగటంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. ఉప్పలపాడు గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యులు మోపర్తి శ్రీనివాసరావుకు చెందిన లారీని గ్రామంలోని మెయిన్ సెంటరులో ఉంచారు. ఆ లారీలోని బ్యాటరీలను దొంగలు అపహరిచారు. అదేవిధంగా గత రాత్రి నన్నపనేని ప్రసాదు వ్యక్తి ఇంట్లో చొరబడి రెండు సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాలను ఎత్తుకుపోయారు. పెద్ది వెంకటేశ్వరరావు ఇంట్లో చోరీకి ప్రయత్నించారు. బైకు తాళాలు పగలగొట్టి చోరీకి ప్రయత్నించాడు. గురజాల సాంబశివరావు అనే వ్యక్తి ఇంటికి వెళ్లి తాళాలు పగలగొట్టేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. ఇలా గ్రామంలో దొంగలు వరుసగా చోరీలకు పాల్పడుతూ బీభత్సం సృష్టిస్తున్నారు. ఈ దొంగతనాలను నిలువరించేందుకు పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.





కొల్లిపరలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యానికి భద్రత

● ఎంపీడీవో విష్ణుప్రసాద్

కొల్లిపర, జూలై 27 : పరిసరాల పరిశుభ్రతోనే ఆరోగ్యానికి భద్రత అని, అందుకు ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీవో విష్ణుప్రసాద్ అన్నారు. మండల కేంద్రం కొల్లిపరలో అధికారులు శనివారం పారిశుధ్య నిర్వహణపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. పంచాయతీ కార్మికులు రోడ్లపై నిలిచిన నీటిని తొలిగించి బ్లీసింగ్‌ను చల్లారు. ఈ సందర్భంగా విష్ణుప్రసాద్ మాట్లాడుతూ గ్రామస్థులు మంచినీటి పంపుల వద్ద మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. మురుగునీరు నిల్వ ఉండటం వలన అంటువ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. పారిశుధ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని ప్రజలకు సూచించారు. రోడ్లపై దిబ్బలను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ పూర్ణశంకరరావు, పంచాయతీ కార్యదర్శులు ప్రసాద్, మాధురి, ఉషా తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

చేబ్రోలు, జూలై 27: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని ఎంపీపీఎస్(హెచ్‌ఈ) శలపాడు ఉపాధ్యాయులు అనీల్‌కుమార్ అన్నారు. శనివారం స్కూల్ విద్యార్థులకు మొక్కలు పెంపకం వాటి ఆవశ్యకత గురించి ఆయన వివరించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రాంగణంలో పలు మొక్కలను విద్యార్థులతో కలిసి నాటించారు. మొక్కల పెంచడం ద్వారా పర్యావరణంలో పేరుకుపోయిన కార్బన్ డై ఆక్సైడ్‌ను అవి పీల్చుకుని ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వైభవంపై గీతం చిత్రీకరణ

తెనాలి అర్బన్, జూలై 27 : తెనాలి ప్రాభవం, వైభవంపై రాసిన గీతాన్ని చిత్రీకరించనున్నట్లు సాహిత్య సంస్థ స్వరలయ వేదిక అధ్యక్షుడు సాయి లక్కరాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'మంచికే పేరు పెడితే' అనే గీతాన్ని రాశానని ఈ గీతాన్ని తెనాలి ప్రాంతంలో ఆదివారం చిత్రీకరిస్తామన్నారు. సినీ, రాజకీయ, నాటక, కళారంగ ప్రముఖులు శుభాకాంక్షలు అందించే విధంగా చిత్రీంచే గీతాన్ని నవంబర్‌లో విడుదల చేస్తామన్నారు.

శతాబ్ది ఉత్సవాలకు టౌన్ చర్చి ముస్తాబు

తెనాలి అర్బన్, జూలై 27 : తెనాలి పట్టణంలోని బోసురోడ్డులో ఉన్న టౌన్ చర్చి వసతులను మరింత మెరుగు పరుస్తున్నారు. వచ్చే ఏడాది జరగనున్న శతాబ్ధి ఉత్సవాలకు చర్చి లోపల, బయట ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. 1925లో ఈ చర్చిని నిర్మించగా 2025కి నూరు సంవత్సరాల ఉత్సవాలు ఘనంగా జరపాలని కమిటీ భావించింది. భక్తుల వసతికి అనుగుణంగా మార్పులు, చేర్పులు చేపట్టారు. అడహాక్ కమిటీ సభ్యులు శనివారం చర్చి అభివృద్ధి వివరాలను తెలిపారు. రూ.75 లక్షలతో సండే స్కూల్, మీటింగ్ హాలు, స్త్రీల సమాజం నిర్మించామన్నారు. ఇరు వైపులా వరండా విస్తరించామని, ఆధునిక రీతిలో మెయిన్ గేటు ఫ్లోరింగ్ పనులు పూర్తి చేసి భక్తులు మెచ్చేలా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. పాస్టర్ దేవరపల్లి ఏసురత్నం, లెనిన్‌బాబు, కమిటీ సభ్యులు డేవిడ్‌రాజు, వేమయ్య, బుజ్జిబాబు, దేవదానం, చంద్రకుమార్, జాన్‌మోహన్, శ్యాంప్రకాశరావు పాల్గొన్నారు.

ఐక్యవేదిక ఆధ్వర్యంలో అబ్దుల్ కలాంకు నివాళి

తెనాలి రూరల్, జూలై 27: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఐక్యవేదిక రాష్ట్ర కార్యాలయంలో మాజీ రాష్ట్రపతి ఏపీజీ అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అక్కిదాసు కిరణ్‌కుమార్, అనీల్ పాల్గొన్నారు.



కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ మైనార్టీ ఐక్యవేదిక నేతలు